

<u>*కథ 1995*</u>

**3**

# జీవన్మృతుడు

ఆడెపు లక్ష్మీపతి

"గణ... గణ... గణ..."

నిరంతర ప్రవంతియైన కాలం.

రోజులు, గంటలు, నిమిషాలు, సెకండ్లుగా మానవ సౌలభ్యం కొరకు విభజింపబడ్డ కాలం.

గడియారం మీది అయిదు గంటల రెండు నిమిషాల పదిహేను సెకండ్ల దగ్గర నిర్ణీత పౌనః పున్యంతో శబ్దతరంగాలను ఫిరంగు గుండ్లలా శ్రవణేంద్రియం గుండా పంపి సుషుప్తావస్థా కంచుకోటను బ్రద్దలు కొట్టింది.

అరె... ఏమయింది...? అకస్మాత్తుగా ఏమిటా హూటర్...?

కంప్రెషర్ ఆగిపోయి, సింథసిస్ రియాక్టర్‌లో రసాయనిక ప్రక్రియ స్థంభించిందా...?

గత పక్షం రోజుల్నించి సాఫీగా, ఎనభై శాతం లోడుతో, సమస్థాయిలో నడుస్తోన్న ప్లాంటులో ఉత్పత్తి నిలిచిపోతే...??

ఇరవై రెండు వేల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గండిపడినట్టే...

ప్రోత్సాహక బోనస్ ఇక అందని మానిపండు.

అసలు మెషీన్ ఎలా ఆగిపోయింది? ఇంటర్ లాక్ అన్నీ సవ్యంగా పనిచేస్తున్నాయన్నమాట...! స్టీమ్ పీడనం ముప్పయికి పడిపోయిందా? ప్రకంపనాలు టర్బయిన్ వైపు మితిమీరి అయిదు మిల్లీమీటర్లు తాకాయా?

పానెల్ మీద మిణుకు మిణుకుమంటున్న సంకేతం చూస్తేకానీ కారణం తెలీదు.

"గణ... గణ..."

ఇంకా హూటర్ మోగుతూనే వుంది. రీసెట్ కాలేదు.

ఈ పానెల్ ఆపరేటర్ పన్నాలాల్ వెధవ ఎక్కడ చచ్చాడు?

ఫోర్‌మన్ షణ్ముగం కూడా కునికిపాట్లు పడుతున్నాడా?

ఇది ఖాయిలాపడ్డ ప్రభుత్వరంగ పరిశ్రమ. మూసివేత ప్రమాదం నెత్తిమీద ఖడ్గంలా వేలాడుతోంది. కానీ ఎవడికీ భయం వున్నట్టు కనపడ్డం లేదు. ఇడియట్స్... లే... లే! తప్పదు! కింకర్తవ్యం?

చీఫ్ ఇంజనీరుకి కబురు చెయ్యాలి. వివరాలు, సంజాయిషీలు... చీవాట్లు... వీటితో పాటు ఒక గంట కాలహరణం తర్వాత మళ్లా యంత్రాల హోరు... ఉత్పత్తికోసం పడిగాపులు.

భౌతిక ప్రపంచపు క్షితిజ సమాంతర రేఖకు దిగువన, వేల యోజనాల దూరంలో, ప్లాస్మాలా ప్రవహిస్తున్న ఆంతరిక సుప్తచైతన్యం కాలం పంపిన విద్యుదయస్కాంత సంకేతాలు అందుకుని కాంతివేగంతో ఊర్ధ్వముఖంగా పరిగెత్తి, వాస్తవ జగత్తు తాలూకు తరంగ దీర్ఘతతో అనుసంధానం చెందింది.

సకల చరాచరలోకం దృగ్గోచరం. జీరో వాట్ వెలుతురులో నాల్గు గోడల లోపలి నిరూపక జ్యామితి కోణాలు, అక్షాలు!

ఫూల్.. ఇది ప్లాంటు కాదు... వాహ్... ఫ్యాక్టరీ పరిసరాలు అసలేకావు.. ఇది టౌనుషిప్పులోని ఆఫీసర్ల కాలనీలో నీ ఇంట్లో నీ పడకగది.

అతి భారంగా, అసహనంగా ఎడమచెయ్యి టైమ్ పీస్ వేపు సాగింది. వేలు తాకీతాకక ముందే అలారం ఆగిపోయింది.

ఈరోజు వాకింగ్‌కి వెళ్లకపోతేనేమి? ఏడున్నరదాకా సుఖనిద్ర పోతే ఎంత హాయి! బాహ్య ప్రపంచం నుండి అవతలికి తన్నుతాను ముసుగు డొల్లలోనికి విసిరేసు కుంటే ఎంత బాగుంటుంది! నాడీమండలం రెస్టిల్ మాత్రల ప్రభావం నుండి ఇంకా విముక్తమయినట్టు లేదు. బద్దకం, నిద్రమత్తులు జడత్వసూత్రానికి ప్రతీక లుగా నిలిచిపోతామంటున్నాయి. బయట ఏ సవ్వడీ వినబడడంలేదు. అర&ధరాత్రి కాదుకద...? కిటికీ తెరచి చూస్తే తెలుస్తుంది.

కుడిచేయి విసురుకు కిటికీ భళ్లున తెరుచు కుంది. రివ్వుమంటూ చల్లటి గాలి ఈథర్ ఆవిరిలా మొఖాన్ని తాకింది.

అవతల అంతా చీకటి. రోడ్డు మలుపు దగ్గర వీధిదీపం వెలగడంలేదు. గహనంగా ఉన్న పరిసరాల్లో నల్లటి కాన్వాసు మీద మరింత నల్లటి రంగుతో చిత్రించ బడ్డ పెయింటింగులా అగుపడుతున్నాయి చెట్లు.. ఇళ్లు...

ప్రభుత్వరంగంలోని ఈ పెద్ద రసాయనాల కర్మా గారంలో ప్లాంటు ప్రాసెస్‌ను నియంత్రించే ఆపరేటర్ గా, చార్జిమన్‌గా, షిఫ్టు ఇన్‌ఛార్జిగా, అసిస్టెంటు ఇంజి నీరుగా ఇరవై ఏళ్ల సర్వీసు గడిచింది.

కర్మాగారంలోని రసాయనిక ద్రావకాల, సేంద్రియ వాయువుల, అధిక పీడన స్టీముల ప్రవాహాలే నీ దేహంలోని కవోష్ణ రుధిరధారలు.

పంపుల, కంప్రెసర్ల, టర్బయిన్ల భ్రమణగతులే నీ వివిధ శరీరాంగాల కదలికలు.

విభిన్న భౌతిక, రసాయనిక ప్రక్రియలు జరిగే టప్పుడు హీట్ ఎక్స్ఛేంజర్లు, డిస్టిల్లేషన్ టవర్లు, రియా క్టర్లు నిశ్వసించే వెచ్చని దీర్ఘమైన శ్వాసలు, ఆటోమేటిక్ యంత్రాలు, రిమోటు కంట్రోలు వాల్వులు సంక ల్పించినప్పుడు వెలువరించే సన్నటి రొద, అప్పుడప్పుడు స్వయంచలిత పరికరాలు వ్యర్థవాయువుల్ని వాతా వరణంలోకి చిమ్మేటప్పుడు శబ్దించే గర్జనలు నీ నులి వెచ్చని ఊపిర్లు.

ఈ సుదీర్ఘానుభవంలో నీ చేతుల మీదుగాగానీ, నీ సమక్షంలోగానీ సంభవించిన అసంఖ్యాకమైన స్టార్టప్పులు, బ్రేకుడవున్లకు సంబంధించిన ఘటనలు, చర్యలు, అయిదేళ్లు అహోరాత్రులు శ్రమించి పట్టా పుచ్చుకున్న ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియన్ ఇంజనీర్స్ సంస్థవారి కెమికల్ టెక్నాలజీ సబ్జక్టులు, ఉత్పాదన ప్రక్రియానియంత్రణా విధానాలు, రసాయన చర్యల మౌలికసూత్రాలు, స్థితిమార్పిడి సమతౌల్య సిద్ధాంతాలు, ఉష్ణగతిక శాస్త్ర గణిత సమీకరణాలు...

ఇవే పడుగు పేకల్లా అల్లుకుపోయిన నీ మస్తి ష్కంలో ఇంకా అవే ఆలాపనలు, అసంకల్పితా లోచనలు... కలయో వైష్ణవమాయయో అన్నట్టు అగు పడుతున్నా కఠోరవాస్తవంగా జరిగిన ఘోర ప్రమాదం తర్వాత సురక్షాలేమికి ఆలవాలం ఈ పరిశ్రమ అన్న నిందను మోస్తూ, నిశ్చలంగా పడివున్న ప్లాంటులోని పరికరాలు, మెషీన్ల గురించి భావచిత్రాలే ఇంకా మెరుపుల్లాగా ఉద్ఘాటిస్తున్నాయి నీ బుర్రలో.

జీవితంలో సగభాగం నిద్దురకే... మిగిలిన సగ భాగం చిత్తశుద్ధి వుండదు.

లే... లే... వినబడ్డంలేదా కొరడా ఝుళి పింపులు?

కొత్త సంవత్సరం జీవితంలో సమూలమైన మార్పులు తెస్తోంది. అమలు జరపాల్సిన నిర్ణయాలు, తిరగాల్సిన మలుపులు, పూర్తి చేయాల్సిన కర్తవ్యాలు, బొంబాయి నగర కాస్మోపాలిటన్ సంస్కృతిలో పరిఢ విల్లుతున్న 'మేఘన' బార్ అండ్ రెస్టారెంట్‌లో అర్ధ నగ్నంగా సఖి నింపి టేబుల్ మీద ఉంచిన విస్కీ గ్లాసులా అతి చేరువలోకి వచ్చేశాయ్.

ఉఫ్... ఆఁహ్... ఓహ్... ఇంకా... ఏదీ... ఇంకా దగ్గరగా...

అసంపూర్ణంగా మిగిలిపోయిన పథకాలు ఇక ముందు సునాయాసంగా పూర్తవుతాయంటూ కలగ బోయే కలిమి, కురవబోయే కనకవర్షం వెలుగులో కాబరే నర్తకి డిమ్‌లైటు వెలుతురులో చిందిస్తున్న మేని విరుపుల్లా మెరుస్తున్నాయి.

జిం...జిం...జిం... .డ్రన్..డ్రన్... ధన్...ధన్. వ్హుఁయ్... య్యాహ్... సాకీ, ఆలస్యమెందుకు? అందించు మధుపాత్రిక, ఏక్‌దో... తీన్... దస్ కదం మననం చేస్కో... హోరి పిడుగా... ఇరవై ఏళ్ల కిందట టెక్నికల్ ట్రయినింగు చేస్తున్నప్పుడు వ్యాయామ శిక్షకుడు కెప్టెన్ వరదాచారి నేర్పించిన కసరత్తులు వట్టి పోలేదు. ఇంకా ఆవలింతలేమిటి... బద్దకం కుబుసం లోంచి వళ్లు బయటపడుతుంటేనూ... గేటు వాల్వు గుండా వేడి ద్రావకం ప్రవహిస్తోంది. రిబాయిలర్‌లో అంతర్గతోష్ణం పెరుగుతోంది. పంచేంద్రియాలు జాగృదా వస్థ అధీనంలో కొచ్చేశాయి.

టిక్... ట్యూబులైటు వెలిగి గదంతా తెల్లటి వెలుగు వెల్లువ. అంకెల్లోకి కుదించుకుపోయిన కాలం గోడకు వేళ్లాడుతోంది. ఇవ్వాళ తేది జనవరి ఇరవై

ఎనిమిది. కొత్త సంవత్సరంలో మొదటి నెల ఇట్టే గడిచి పోయింది!

జీవితం సాపేక్షవేగంతో పరుగెడుతోందా? ఐన్‌స్టీన్ మహాశయుడు సిద్ధాంతీకరించినట్టుగా దీర్ఘత ముకుళించిందా? కాలం విస్తరించిందా? విరుద్ధం... అభాస... డ్రెస్సింగ్ టేబుల్ అద్దంలో నీ ప్రతిబింబం ముప్పయిలాగా కనబడుతోంది. పొరడాక్సికల్లీ... జనవరి రెండు నాడే నువ్వు నలభయ్యో పడిలో పడ్డావ్‌కద...? పిచ్చి రుక్మిణి... తను పడుచుప్పిలలా ఉన్నట్టు భ్రమపడుతోంది. నువ్వు మరీ ముసలాడిలా కనపడుతున్నావని వాపోతోంది. చెవుల దగ్గర జుట్టుకు నల్లరంగు వేసుకొమ్మని నీకు హుకుం జారీచేసి, నిన్న దగ్గర నిలబడి మరీ అమలు జరిపింది. మార్పు కొట్టొచ్చినట్టుగా ఉందేమో... నిన్న వీడ్కోలు విందులో చాలామంది డిపార్టుమెంటు సహోద్యోగులు, 'ట్రిమ్‌గా తయారయి, చాలా స్మార్ట్‌గా కనపడుతున్నారు. అప్పుడే విదేశీయులయిపోయారే,' అంటూ నవ్వారు.

కొత్త నిర్ణయాలు... 'మంచి నిర్ణయాల గురించి' రాబర్ట్‌లిండ్ వ్యాసం... ఎప్పుడో పాఠ్యాంశంగా చదివిన గుర్తు లీలగా...

ఎంతోకాలం తర్వాత సాంకేతికేతర విషయాలు చదివాకగాని జ్ఞానోదయం కలగలేదు. పాల్‌హాక్ రాసిన- 'ఆరోగ్యం - దీర్ఘకాల జీవితం', 'నీకు నీవే మంచి మిత్రుడివి కావడం ఎలా?' పుస్తకాలు పదేసిసార్లు చదివి ఔపోశన పట్టావ్... వాటిల్లోని హితోక్తులు నిశ్శేషంగా జీర్ణం అయిపోయినై. కొత్త సంవత్సరంలో నువ్వు పాటించాలనుకుంటున్న నియమాలు. మద్యపానం, ధూమపానం విసర్జించాలి. తేలికపాటి కసరత్తు అభ్యాసం చేయలి. ఇంకా ఖర్చు విషయంలో పొదుపు పాటించాలి. మొదటి మూడు అంశాలు నీ చేతుల్లోని పనులు కానీ నాలుగో నియమం పాలనకు రుక్మిణి సహకారం అవసరం. రుక్మిణిని వొప్పించడం అంటే కుందేటి కొమ్మును సాధించడమన్నమాటే!

కొత్త సంవత్సరానికి ఆహ్వానగీతం... ఆనందం... హర్షాతిరేకం... ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన సంగీత విభావరి. కుటుంబసమేతంగా హాజరయిన ఆఫీసర్లు. ఆ రంగుల కోలాహలం, నవ్వుల, పువ్వుల కేరింతలు, గానాబజానాల హరివిల్లు. క్షణం క్రితమే తిన్న రసమ్మలాయి తీపిగుర్తులాగా ఇంకా కళ్లకు కట్టినట్లు కనపడుతోంది. ఆర్కెస్ట్రా బృందం ఆలాపించిన ఆధునిక, పాశ్చాత్య, దేశీయ సంగీత ధునిని ఆస్వాదించడంలో అందరూ లీనమైపోయారు. ఒక ఉద్యోగి కూతురు ఢిల్లీలో లలితకళలు అభ్యసిస్తున్న పాతికేళ్ల అందమైన అమ్మాయి నృత్యం చేసింది. ఇద్దరు యువ ఎగ్జిక్యూటివ్‌లు ఆమె సరసన లయబద్ధంగా అడుగులు కలిపారు. ఇంకొందరు కాలేజీ విద్యార్థినీ విద్యార్థులు, మాధురి, దాని స్నేహితురాళ్లు హుషారుగా వచ్చీరాని డిస్కో చేశారు. అదో ప్రత్యేక ఆకర్షణ. ఇద్దరు మహిళలు ఉత్సాహంగా ముందుకొచ్చి మైకు దగ్గర పాటలు పాడారు. ఓ వృద్ధుడు ఎస్.డి. బర్మన్ శైలిలో 'వహ్ కౌన్ హై తేరా వో రాఁహీ...' అన్న తత్వగీతం గానం చేశాడు. జనరల్ మేనేజర్ సైతం ఓ మాంఛి పాట పాడాడు. మేరే దోస్త్ తుఝె మేరే ఈద్ ముబారక్... ఈద్ ముబారక్ నయా సాల్ ముబారక్...' అని భజనరాయుళ్లు ఆ సర్దార్జీ జియంని పొగడ్తలతో ముంచెత్తారు. ఆహా... ఓహో... ఎంత శ్రావ్యంగా ఉంది గాత్రం... అంటూ.

నీ సహోద్యోగులు, మిత్రులు చాలామంది ఈ తంతుకు దూరంగా ఉద్యానవనంలో చెట్ల మధ్య గుంపులుగా కూర్చుని సోక్రటీసు కాలంనాటి సింపోజియంలో నిమగ్నమయి తత్వచింతన చేశారు. నువ్వూ వాళ్లలో చేరిపోయావ్.

ఖాయిలా పడ్డ పరిశ్రమల్ని ప్రభుత్వం నిజంగా మూసివేస్తుందా...?

అన్నింటినీ మూసివేయకపోవచ్చు. కానీ చాలా వాటిని ప్రయివేటుపరం చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

అరెరే... ఇండస్ట్రియల్ ఫైనాన్షియల్ రీ కన్‌స్ట్రక్షన్ బోర్డు మన ఫ్యాక్టరీ గురించి మరీ అంత నిరాశాజనకమైన తీర్పు ఇచ్చిందేమిటి? వ్యవసాయ సంబంధిత ఉత్పత్తుల పరిశ్రమను అంత తేలికగా మూసివేయడమే? మరి ఉద్యోగుల గతి ఏమిటి?

దిగుమతి చేసుకున్న సరుకు చౌక అని మన ఆర్థిక సచివుల దృఢాభిప్రాయం. ఉద్యోగుల గురించి అంటావా బదలాయింపులు, పునర్నియామకాలు ఉంటాయని హామీ ఇస్తున్నారు కదా! అయినా 'స్వర్ణ కరచాలనం'ను మరింత ఆకర్షణీయం చేస్తే ఎవరికీ అభ్యంతరముండదు.

ఎంతకాలం దిగుమతుల మీద ఆధారపడతాం? స్వావలంబన అవసరంలేదా?

ఆ విషయం ఏలినవారికి తెలీకనా...? ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు మన ఆర్థిక వ్యవస్థను నియంత్రిస్తున్నాయి.

ఇంకో పదేళ్లలో అన్నిరంగాలు ప్రయివేటు సంస్థల హస్తగతం కావడం ఖాయం. బహుళజాతి సంస్థల దయాదాక్షిణ్యాలపై ఉద్యోగుల భద్రత ఆధార పడి వుంటుంది. అప్పుడు నష్టాలకు మనమెలా బాధ్యులం? మానేజిమెంటును మార్చి, కరెంటు, ముడి సరుకు సరఫరాకు హామీ ఇచ్చి, ఇరవైకోట్ల అనామతు పెట్టుబడి ఇస్తే మన ఫ్యాక్టరీ తప్పక లాభాలబాటలో నడుస్తుంది. ముందు ఈ అవినీతి మానేజిమెంటును మార్చాలి. మన డివిజన్ స్వతంత్ర సంస్థగా ఉండాలి. ఇంతవరకు మన లాభాల్ని ఉత్తరాది డివిజన్లు మింగే స్తున్నాయ్.

ఉష్... ఈ మూసివేత బెదిరింపు ఉత్త తాటాకు చప్పుడు. ఇంత పెద్ద ఫాక్టరీని మూయడానికి ఎన్ని గుండెలు కావాలి? ఏ పార్టీ ముందుకొస్తుంది దీన్ని చేపట్టడానికి? నష్టాల్ని పూడ్చాలంటే దీన్ని పునరుద్ధరిం చడమొక్కటే మార్గం. ఏదైనా మనమీద చర్య తీసుకో వడమంటూ జరిగితే అది పార్లమెంటు ఎన్నికల తర్వాతనే... ఇంకా చాలా సమయముంది. మీరు అతిగా ఊహించుకుని బుర్రలు పాడుచేసుకోకండి. కమాన్... హావ్ అనదర్ డ్రింక్... అండ్ గెట్ ద రిలీఫ్.

మందుపార్టీలో తెల్లారేదాకా చర్చలు... ఆర్థిక ప్రగతి గురించీ, ద్రవ్యోల్బణం గురించీ, మన్మోహన్‌సింగ్ మనోగతం, బహుళజాతి సంస్థల ప్రభావం గురించీ, కుళ్లు రాజకీయాలు, సమాజంలో అవినీతి గురించీ, అమెరికా పెత్తనం, అంతర్జాతీయ పరిణామాల గురించీ, మార్కెట్టులో పెరుగుతోన్న ధరలు, పెండింగు లో ఉన్న వేతన సవరణల గురించీ, స్కాం తరువాతి సెన్సెక్సు పతనం గురించీ, ప్రస్తుతపు స్టాండర్డు స్క్రిప్పుల గురించీ, ఫ్యాక్టరీ మూసివేతకు గురయ్యే పక్షంలో ఎదురయ్యే సమస్యల గురించీ విభిన్న వ్యాఖ్యానాలు, వివిధ రకాల విమర్శలు... ఆత్మసంతృప్తి కోసం ఓదార్పులు, ఆశావహ అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

అర్ధరాత్రి తర్వాత అందరి హర్షధ్వానాల మధ్య జనరల్ మానేజరు నూత్న వర్ష సందేశం ఇచ్చేందుగ్గాను మైకు చేతబుచ్చుకున్నాడు. సుదీర్ఘమైన ఉపోద్ఘాత మిచ్చి, మధ్య మధ్య పంజాబీ కవితల్ని ఉచ్చరిస్తూ, హిందీ సినిమా పాటల్ని ఉటంకిస్తూ ముప్పావుగంట సేపు ఉపన్యాసమిచ్చి, జనాన్ని వణికించే చలిలో నిలబెట్టి అవస్థపెట్టాడు. అఫ్‌కోర్స్... కొసమెరుపుగా ఉపన్యాసం ముగిస్తూ అందరిలో చలి ఎగిరిపోయే ట్టుగా బాంబు వొకటి పేల్చాడు...

"వరుసగా అయిదేళ్ల నుండి నష్టాల్లో కూరుకు పోయిన సంస్థలను ప్రభుత్వం ఇంకెంతమాత్రమూ భరించదలచుకోలేదని తేటతెల్లమౌతోంది. ఏ కోణం లోంచి చూసినా మన భవిష్యత్తు అంధకారం. నిధులివ్వ మని అడిగితే ప్రభుత్వం మొండిచెయ్యి విదిలిస్తోంది. రాబోయే బడ్జెట్‌లో మన కంపెనీకి ఎలాంటి నిధుల కేటాయింపు ఉండకపోవచ్చుననీ, నిధులను మనమే సృష్టించుకోవాలనీ కేంద్ర కార్యాలయం నుండి మొన్న మనకు వచ్చిన వర్తమాన సారాంశం. అయితే బడ్జెటేతర నిధుల నుండి మాత్రం మనకు కొంతకాలం జీతాల పైకం రావచ్చు. అదీ నెలనెలా సమయానికి వస్తుందన్న నమ్మకం లేదు. ప్రస్తుతానికి అలవెన్సుల కోత గురించి మంత్రిత్వశాఖ తీవ్రంగా యోచిస్తుందని అభిజ్ఞవర్గాల కథనం. అయినా మనం అధైర్యపడకూడదు. ఇంత పెద్ద పరిశ్రమను, రెండువేల మంది ఉద్యోగులున్న మన డివిజన్ను రక్షించుకునేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేద్దాం. ముందుగా నా విన్నపం ఏమంటే, మనం కొన్ని త్యాగాలకు సంసిద్ధులం కావాలి. ఆర్థిక క్రమశిక్షణలో భాగంగా మనం కొన్ని భృతులు, సౌకర్యాలు మరిచి పోవాలి."

ఆహా... ఎంత చక్కటి సూక్తి ముక్తావళి ప్రబోధి స్తున్నాడు!

అందరికీ మత్తు దిగిపోయింది. కొందరికి అంత చలిలో కూడా చిరుచెమటలు పట్టినై. డౌన్ స్టేజి లైటు వెలుగు ముఖంమీద పడుతుండగా, గెడ్డం నిమురు కుంటూ తాపీగా చెప్పుకుపోతున్న జియం అచ్చం 'పాతాళభైరవి' సినిమాలో మాంత్రికుడిలాగా కనపడ్డాడు.

ఓయీ మాయలఫకీరూ.. రెండేళ్లలో కంపెనీనీ తుక్కుకింద మార్చిపడేశావ్... నువ్వు జియంగా వచ్చా కనే కంపెనీ పీకలదాకా నష్టాల ఊబిలో కూరుకు పోయింది. హుం... ఫట్ అని కరిమింగిన వెలగపండును ముందు పడేశావ్. కరెంటు పుష్కలంగా లభిస్తున్నప్పుడు బాయిలర్ శుభ్రం చేయించే నెపంతో బలవంతపు ఉత్పత్తి నిలుపుదలకు ఆదేశమిచ్చావ్... వచ్చేది వేసవి కాలం, నదిలో నీరుండదు అని తెల్సి కూడా రిజ ర్వాయరు పూడిక తీసివేతకు అనుమతిచ్చావ్. ఫలితం నెలరోజుల ఉత్పత్తి నష్టం. పేరుకే కాలుష్య నియంత్రణ అయినా పనికిమాలిన బూడిద కుంట నిర్మాణానికి నిధులు మళ్లించావ్. కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా... మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టు అయింది కంపెనీ పరిస్థితి. కంట్రాక్టుల్లో సింహభాగం

నీదీ, నీ డిప్యూటీ ఆ నక్కజిత్తుల మద్రాసీ డిజియం దీనూ. మూడు తరాలకు సరిపడా సంపాదించుకుని ఉంటారు గాదెకింది పందికొక్కుల్లాగా. కాలుష్యంలో వేడి వాతావరణంలో రోజుకు పన్నెండు కాదు అవసర మయితే పదహారు గంటలు పనిచేస్తున్న మేము త్యాగాలు చేసి డొక్కలెండబెట్టుకోవాలా గాడిద కొడుకా... థూథ్... అని ఈసడించుకున్నారు చాలా మంది. కొందరు కోపాల్ని విస్కీలో కలిపి గొంతు కిందికి నెట్టేశారు. ఆక్రోశాన్ని జింజర్ చికెన్ ముక్కల్లో కసబిస నమిలి దిగమింగారు.

తెల్లవారుఝాము నాలుగ్గంటలదాకా సాగింది సింపోజియం. విషయం విదేశాల్లోని ఉద్యోగావకాశాల మీదికి మళ్లింది.

బొంబాయిలో నువ్వు ఇచ్చి వచ్చిన ఇంటర్వ్యూ విశేషాలడిగారు. ఎవరికీ చెప్పొద్దనుకున్నావ్ కానీ ఆరోజు బహిర్గతం చేశావ్.

"మనవాడు తప్పక సెలెక్టు అవుతాడు ఆఫర్ వస్తే కళ్లు మూసుకుని వెళ్లిపో దోస్త్. మనవాడి మంచి భవిష్యత్తు కొరకు మరో పెగ్గు మైడియర్ ఫ్రెండ్స్..."

మొత్తం ఏడు పెగ్గుల విస్కీ... శ్వేతకాష్టాలు రెండు ప్యాకెట్లు తగలేశావ్... జీవితమంతా సరిపడే సరుకు ఒకేసారి మింగేశావ్... బస్‌కరో... కభీ న పీనా అయిందా... తల దిమ్మెక్కింది... కడుపులో తిప్పి నట్టయింది.

ఇప్పటివరకు మళ్లా మద్యం వాసన చూడలేదు. సిగరెట్ల జోలికి పోలేదు. గుడ్ బోయ్. నీలో ఇంత సహిష్ణుత, ఆత్మనిగ్రహ శక్తి ఉందా! బ్రేవో... కీపిటప్... అల్పసంతోషీ... నీకీమధ్య ఆలోచనలెక్కువుతున్నాయ్. అదిగో టయిమ్ అయిదు గంటల నాలుగు నిమిషాలు. చీలిన పాము నాలికలాగా పచ్చగా మెరుస్తున్నాయి ముళ్లు. కాలం, పాము... కాలనాగు. కాలాన్ని నాగుతో పోల్చడమేమిటి...? కాలం కూడా కాటువేస్తుందనా నొప్పి తెలీకుండానా...? అంతే అయి వుండాలి? ఒక్కొక్క నిముషం గడిచినకొద్దీ వయస్సు పెరుగుతోంది. అంటే ఆయుష్షు తరుగుతోంది. వృధ్యాప్యపు చెరలోకీ, మృత్యువు సన్నిధిలోకీ ఒక్కొక్క మెట్టుగా పతనం. భారతీయుడి సగటు ఆయుఃప్రమాణం అరవై ఐదు ఏళ్లు అనుకుంటే నీ ఆయుష్షు మూడింట రెండు వంతులు హరించుకుపోయింది. ఆరోగ్యం దీర్ఘకాల జీవితం. ఆరోగ్యమే మహాభాగ్యమట. అదిసరే... ఈ రోజుల్లో బతకాలంటే, రెండు చివర్లను కలపాలంటే డబ్బు కావాలికదా! సంవత్సరానికి మూడులక్షలు... ఇక్కడ జీవితాంతం గాడిదచాకిరీ చేసినా లక్ష రూపాయలు గగనకుసుమం. ఘటనల పరంపర... పోయిన అక్టోబరు పదిహేనున ఇంటర్వ్యూ, జనవరి ఐదున ఉద్యోగ ఖరారు, ఉత్తర్వు చేతిలో పడ్డం, ఎని మిదో తేదీ మెడికల్ టెస్టు, ముప్పయి ఒకటిన ఫ్లైటు... ఇవ్వాల్టినుండి మూడోరోజున ఈ దేశం నుండి ఎగిరి పోతున్నావ్. ఒత్తిడి, టెన్షన్... డాక్టరంటాడు హైపర్ టెన్షనని. ధారాపుత్రులను వదలి అరేబియా ఎడారిలోకి పయనం. దేశ బహిష్కార శిక్ష... నీ అంత నీవుగా ఆ కాన్‌సెంట్రేషను కాంపుల్లోకి వెళుతున్నావ్... సంవత్సర కాలం ప్రవాసంలో గడపాలి... గడపగలడా? డయా స్టోలిక్ పీడనం వందకన్నా కిందికి దిగి రానంటోంది. రాత్రుల్లో మెలుకువలు... రెస్టిల్, బీటాబ్లాకర్లతో అదుపు... వాకింగ్ దివ్యంగా పనిచేస్తోంది. కుఛ్ ఖో కర్ పానాహై... కుఛ్ పాకర్ ఖోనాహై... జిందగీ కా మతలబ్ హై ఆనా ఔర్ జానాహై... బిపి గురించి బొంబాయిలో డాక్టరు చెప్పాడు అక్కడికి వెళ్లాక. అంతకుముందు తెలీదు. దానికి మరో టెస్టు ఉంటుందిట. అన్నీ నియం త్రించుకోవాలి. ఇప్పటివరకూ బొంబాయి పర్యటనలకు పదివేల రూపాయల ఖర్చయింది. ఇంకా ఏజంటు ముడుపులకు, దారిఖర్చులకు కలిపి కనీసం ముప్పయి ఐదువేలు. ఫికర్‌మత్‌కరో, అరె... బుద్ధూ... ఖజానా అందుకోబోతూ బేజారు ఎందుకవుతావు బే! ఫ్లయిటు లో నీ ఫేటు మారుతుంది. సింపతెటిక్ నాడుల్ని శాశ్వ తంగా అణచివేస్తే ఎంత బాగుండును? పద పద... త్వరగా టాయిలెట్ ముగించు... డ్రెసప్...

ఊఁహు.. ఈ ఫ్లష్ పన్చెయ్యదు... బకెట్టు నీళ్ల తోటే దారిద్ర్యాన్ని ప్రక్షాళన చేసెయ్.

"అబ్బ వేళకాని వేళ భూపాళం పాడినట్టు... ఏమి టండీ ఆ బకెట్ల తప్పెట్ల మోతలు...? గణగణలు... ఇప్పుడు టయిమెంత? పన్నెండా... ఒంటిగంటా...? ఇలా రండి. ఇక్కడ పడుకుందురుగాని."

పాపం! రుక్మిణికి నిద్రాభంగమయి సణుగు తోంది. ఈ పందొమ్మిదేళ్లుగా మీ వైవాహిక జీవన రాగానికి తనే సంగీత నిర్దేశకురాలిగా వ్యవహరిస్తోంది. సణుగుళ్లు, విసుగుళ్లు, విసుర్లు, కొండొకచో బెదిరిం పులు... షడ్జమాలే ముప్పాతిక భాగం రాజ్యం చేశాయి. సోక్రటీసు భార్యను భరించలేదా...? ఆఫ్టరాల్ మారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్. పెళ్లయిన మొదటి వారంలోనే కాలరీ ప్రాంతంలో రాకాసిబొడ్డు పరిసరాల్లో ఉన్న పాత

పెంకుటిల్లు చూసినప్పుడు వల్లకాట్లో పడేశారు నన్ను అని గొణుక్కుంది రుక్మిణి. టౌన్‌షిప్‌లో కొత్తకాపురం ఆరంభంలో నీ షిఫ్టు డ్యూటీలను చూసి, ఉద్యోగమంటే తొమ్మిది నుండి అయిదు గంటల వరకుంటుందను కున్నాను. ఈ అర్ధరాత్రుల్లో, అపరాహ్ణ వేళల్లో ఉరు కులు, ఈ ఆపరేటర్ నౌకరీ ఏమిటో అని సణుక్కుంది.

పిల్లల బారసాలలప్పుడు, తదితర కార్యక్రమా లప్పుడు నీ తరపు బంధువులు, ఎప్పుడో 'ఒకసారి వస్తే' పల్లెటూరి మనుషులు... కట్టు, బొట్టు తెలీదు... ప్రతిష్ట తీసేస్తున్నారు. వీళ్లను ఈ ఛాయలకు ఇంకోసారి రానీ యొద్దు! అని విసుక్కుంది.

అయిదేళ్లు గడిచాక, 'ఈ కింది స్థాయి ఉద్యోగు లుండే లేబరు కాలనీలో ఉండలేకపోతున్నాను. త్వరగా బి టైపు క్వార్టర్‌కు మకాం మార్చే ఏర్పాట్లు చేయండి. లేకపోతే పుట్టింటికెళ్లిపోతాను,' అంటూ అలకలు పోయింది.

'బతుకంటే ఆఫీసర్లదే... ఇదేమి వర్కర్ ఉద్యోగ మండీ! ఆయిల్, గ్రీజు మరకల దుస్తులతో,' అని మరో విడతగా ఎద్దేవా చేసింది.

కాలక్రామేణా నీవు రెండవ తరగతి ఎగ్జిక్యూటివ్ అయి ఆఫీసర్ల కాలనీ సి టైపు ఇంట్లోకి వచ్చాక, 'ఆఫీసర్ అయినంత మాత్రాన ఏం ప్రయోజనం...? తగ్గట్టుగా హోదా అవలంభించకపోతే నలుగురూ నవ్విపోరూ,' అంటూ మూతి ముడిచింది.

'ఫ్రిజ్, కూలర్, విసిపి, వాక్యూంక్లీనర్, వాషింగ్ మిషిన్... ఇంకా ఫర్నీచర్ వగైరాలతోపాటు కారు కొనాల్సిందే,' అని గద్దించింది.

అలా పోయి పోయి రుక్మిణి ధోరణి పరాకాష్టకు చేరి ఇటీవల కొన్ని బృహత్తర ప్రణాళికలు రచించింది. 'అవి పూర్తి చేయకపోతే మన బతుక్కీ, బిచ్చగాళ్ల బ్రతుక్కీ తేడా ఏముందట...' అంటూ నీ అహం మీద అంకుశం పోటు వేసింది. ఇలా నీవు నీ రుక్మిణి ఆశల సుడిగుండంలో మునుగుతూ, తేలుతూ జీవనపోరాటం అలుపు ఎరుగకుండా చేస్తూనే వస్తున్నావ్..

"తెల్లవారుతోంది... నేను వాకింగ్‌కు పోతున్నాను. మధూని లేపు... అలారం మోగినా మెలకువ రాలేదా దానికి? ట్యూషన్ టైమవుతోంది."

"ఉష్... గట్టిగా అరవకండి. వెర్రిపిల్ల జడుసు కుంటుంది. ఇవ్వాళ జాగింగ్ ఏమిటండీ? సంబడం చాలుగానీ అబ్బ చలి... ఇంకో అరగంట పడుకోనీ యండి."

మత్తు... నిద్రమత్తు... నిరంతర అప్రమత్తతే నీవు స్వేచ్ఛ కోసం చెల్లించాల్సిన మూల్యం. ఇకనైనా జాగ్తే రహో... వెర్రిపిల్ల జీటివీలో హార్రర్... సీరియల్ చూడొ ద్దంటే వినదు. హార్రర్... టెర్రర్... సర్వత్రా భయం.. చంటిదానికి స్కూలు అంటే భయం... మాధురికి ప్రోగ్రెస్ రిపోర్టును తండ్రికి చూపెట్టాలంటే భయం. లెక్కల్లో పూర్... నువ్వు ఇంజనీరింగ్ మాథమేటిక్స్ ఒక్క ప్రయ త్నంలోనే తొంభయి శాతం మార్కులతో పాసయ్యావు.. పండితపుత్రి గదా... తల్లివేపు జన్యువులేమో... నీ బాధ్యత ఏమీలేదా...? నీకు భవిష్యత్తును గురించిన బెంగ... కాదు... రుక్కుమాట జవదాటాలంటే జంకు... రుక్కుకు ఏ భయంలేదు. ఊహు... సరికాదు... ఆవిడకి పొరుగువాళ్లతో పోల్చుకుని, స్థాయిలో ఒక మెట్టు దిగువన ఉన్నామన్న ఆలోచనంటేనే భయం.

మాధురి ఇంకా నిద్ర లేచినట్టులేదు. దాని ట్యూషన్ ఫీజు నెలకు వంద... నువ్వు చెబుదామంటే వినదు... అర్థంగాదట.. అసలు ఇది మగాడిగా పుట్టినా బాగుండేది. కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ రెండు సార్లు పిలిచి హెచ్చరించాడు నిన్ను. ఆడపిల్లల్ని ఆడపిల్ల ల్లాగే పెంచాలనీ, ఇది భారతదేశమనీ, కూతుళ్లని మగ పిల్లలతో చెట్టపట్టాలేసుకుని తిరగకుండా కట్టుదిట్టం చేసుకునే బాధ్యత ఆయా తల్లిదండ్రులదేననీ వార్ని చ్చాడు.. ఇంకో రెండు నెలలు... ఇది పదో తరగతి గట్టె క్కనీయి... తరువాత చదువు రెసిడెన్షియల్ కాలేజీల్లో...

నాలుగ్గదుల పెద్ద ఇంటిలో ఎంతో సామాగ్రి. రవాణాకి గూడ్సు వాగను అవసరమవుతుందేమో. అదంతా సుదర్శనంగాడి బాధ్యత. ఒక్క వస్తువూ పద్ధతి ప్రకారం లేదు. అంతా చిందరవందర. లాటూర్ భూ కంప దృశ్యం ఇలాగే వుంది కాబోలు. డైనింగ్ టేబుల్ మీద ఎంగిలి కంచాలు... కూరలు మిగిలిపోయిన గిన్నెల మీద మూతల్లేవు. పనిపిల్లకు రోజూ పండగేనన్న మాట. కిచెన్‌లో సింక్ నిండా గిన్నెల కుప్ప... నల్లా బొళ్లున పోస్తోంది. దాన్ని కట్టేసి వుంచాలన్న ఇంగితం ఎవరికీలేదు. బాత్‌రూమ్ ముందు మాసిన బట్టల పోగు... వాష్ బేసిన్‌లో టూత్ బ్రష్‌లు... పేస్టు ఎలుకలు పడేశాయా? వార్డురోబ్ నిండా గుట్టలుగా విడిచిన దుస్తులు... అంతా ఒక అధివాస్తవిక చిత్రం... నీ జాగింగ్ బూట్లు ఎక్కడ దాక్కున్నాయో వెతుక్కో. నీ ప్లాంటుకు 'గుడ్ హౌజ్ కీపింగ్‌లో మొదటి స్థానం. స్ఫూర్తిదాయినిగా ముచ్చటైన ఇల్లు ముచ్చటైన ఇల్లు' అన్న బోర్డు కంట్రోలు రూమ్‌లో వేలాడుతోంది... నీ ఇల్లు ఏ రకం ఇల్లు...? లక్షసార్లు చెప్పావ్. వస్తువులను యథాస్థానం లో ఉంచాలని. గమ్‌బాటిల్ సోఫా కింద దూరుతుంది... పిన్నుల డబ్బా, స్టాప్లర్ చెత్త డబ్బాలో దాక్కుంటాయి.

'మమ్మీ నా సాక్సులు...'

'నా కెమిస్ట్రీ పుస్తకం ఎక్కడ పెట్టావే?'

'నా పెన్ను... అబ్బా నా పెన్ను. డాడీ మీరు తీసు కెళ్లారా?'

'ఏ గంగలోకో, వీధి చివరి చెత్తకుండీలోకో కొట్టుకుపోయుంటాయి. వెళ్లండి. వెతుక్కోండి.'

'చాల్లెండి... చిన్న చిన్న వస్తువులు ఎక్కడ చచ్చాయో ఎలా తెలుస్తుంది. పిల్లల్ని గుడ్లురిమి చూస్తూ కాల్చేస్తారెందుకు...' రుక్మిణి దబాయింపు.

'కొత్త పెన్ను కొనుక్కో,' పిల్లలకు మాతృమూర్తి అభయహస్తం...

డబుల్ కాట్ మంచంలో కుర్లాన్ బెడ్‌మీద మూడు స్త్రీ శరీరాలు. వంటి మీద స్పృహ లేకుండా ఉన్న వ్యక్తులు. జనవరి పన్నెండో తారీకు ఉదయం దుర్ముహూర్తాన ప్లాంటులో జరిగిన ఘోరప్రమాద బీభత్స అవశేషం ఇలాగే వుంది. తేడా అల్లా ఇవి సజీవ శరీరాలు. దుర్గంధం లేదు. అక్కడ మసిబారిన ఇనుప బీములు. అష్టవంకర్లు తిరిగిన పైపులైన్లు. కమిలి పోయిన ఆయిల్‌టాంకు, కాలి బూడిదైన కేబుళ్లు. డోకొచ్చేటంతగా ఘాటయిన కమురుకంపు. నలుగురు మనుషులు. ఒక ఇనుస్ట్రుమెంటేషను ఇంజినీరు. ఒక సీనియర్ టెక్నీషియను. మరో ఇద్దరు క్యాజువల్ కార్మికులు. హృదయవిదారకంగా హాహాకారాలు. ఎవరి చెవికీ సోకని ఆక్రందనలు చేస్తూ అసువులు బాశారు. పోయిన ఏప్రిల్‌లో వార్షిక మరమ్మత్తు కార్యక్రమ సందర్భంగా సవరణకు గురి అయిన స్టీములైను ఫ్లోనాజిల్ దగ్గర బద్దలైంది. వెల్డింగ్ జాయింట్ కత్తితో కోసినట్టుగా విడిపోయింది. అధిక పీడనం, అత్యంత ఉష్ణోగ్రత గల స్టీమ్ పావుగంట సేపు హోరుమంటూ చిమ్మింది. కందెనగా ఉపయోగపడే చమురు ట్యాంకు పై మంటలు చేలరేగాయి.

ప్రాణనష్టం. ఆస్తినష్టం ఖరీదు అయిదుకోట్లు...!

ప్రాణాలకు వెల ఎలా కడతావురా బాస్టర్డ్?

ఏబ్రాసీ రావుగాడు సూచించిన సవరణ అది. అది ప్రయోజనంలేని సవరణ అని ఆనాడే తెల్సు. అవార్డుల కోసం వెంపర్లాట.. సహోద్యోగిని కించపరచడ మెందుకులే. పైపుకి వంపులు, అతుకులు ఎక్కువయి మరింత ప్రకంపనానికి దారితీసింది. దానికి తోడు వెల్డింగు లోపభూయిష్టం.

ఆ సూపర్‌వైజర్‌గాడు నువ్వు చెప్పింది వినకుండా వాడి ధోరణిలో వాడు మంచినీళ్ల కుళాయిని బిగించి నంత తేలికగా ఎంతో కీలకమైన పనిని నిర్లక్ష్యంగా పూర్తిచేశాడు. మెటలర్జీలో నీవు చదువుకున్న కర్పన చలన సిద్ధాంతం ఇంకా గుర్తున్నది. ఆ జాయింటును మళ్లా వెల్డు చేయించాలని చీఫ్ ఇంజినీరుతో మొర పెట్టుకున్నావు. పనుల కేటాయింపు, ఆమోదముద్ర అధికారం అంతా మద్రాసీ డి.జి.యం. చేతుల్లో ఉంది. వాడు నీమీదా, చీఫ్‌మీదా కేకలేశాడు. "పనికిమాలిన సిద్ధాంతాలతో పనులకు అంతరాయం కల్గించకండి. పేరుమోసిన కంట్రాక్టరు నైపుణ్యాన్ని శంకించవద్దు. చూడండి. రేడియోగ్రఫీలో జాయింటు ఓకే అయింది," అన్నాడు. అల్ట్రాసోనిక్ పరీక్షలో అసలు లోపం తెలుస్తుం దిరా వెధవా అని అందామనుకున్నావ్. కానీ చెవిటివాని ముందు శంఖమూదినట్టు అన్న సామెత గుర్తుకొచ్చి ఆగిపోయావ్. ట్రిగ్గర్ నొక్కినవాడుకాదు, అది నిష్క్రియా పరంగా చూస్తున్నవాడే అసలు నేరస్తుడు. కానీ నీ స్థాన మేమిటి? మొత్తం యంత్రాంగంలో నువ్వొక మర మేకువు. బిగిసిపోయేలా అరగదీస్తారు. ఇమడకపోతే విసిరి అవతల పడేస్తారు. అంతే... పోతే పోనీ పోరా. ఈ పాపపుజగతిలో శాశ్వతమెవరురా. డాన్ క్విక్సోట్‌లా ప్రవ ర్తించనందుకు సంతోషం. ఉచ్చులో ఇరుక్కుంటావ్.

వెర్రిపిల్ల దుప్పటి ముసుగులో తల్లిని కరచుకుని గోడవైపు పడుకొనుంది. వెల్లకిల్లా పడుకునుంది. స్కర్టు ఎటో చెదరిపోయింది. రుక్... రుక్... రుక్... అరెబాబా రుక్... గివ్ మీ ఎ లుక్... దిల్ మెరా దడ్‌కే తెరెలియె... నిద్రలో కూడా పాడుతుందేమో... దుప్పటి ముసుగు సరిగ్గా లేదు బెడ్‌షీటు కిందకి జారిపోయింది. కేంటీను వెనకాల డ్రయినేజి బురదగుంట... పారేసిన పదార్థాలు తిని తెగబలిసిన కుక్కలు వేసవిలో ఇలాగే పొర్లాడు తుంటాయ్.

"మధూ... లేమ్మా... ఈ రెండు నెలలు కష్టపడు... అయిదుంబావు అయింది."

సీతాకొకచిలుక ప్యూపాదశలోకి ముడుచుకు పోయింది. "పోర్షన్ అయిపోయింది డాడీ. ఉత్త రివిజన్ నడుస్తోంది. నాకు అన్నీవొచ్చు. ఐనా మమ్మీకి చెప్పాను కదా ఇవాళ ట్యూషన్‌కు వెళ్లనని."

...భగవాన్ భగవాన్ జై భగవాన్... బోలో బోలో జై భగవాన్. సర్వం నీవే జై భగవాన్... వెనక వీధిలో మిషన్‌స్కూలు స్వామీజీ ఇంట్లో భజన... అనునాసిక గొంతు. భక్తుల కోరస్.

"రుక్కూ... భజనకు వెళ్లవా...?"

రుక్కు కదిలింది. ఆవులించింది. "సుబ్బలక్ష్మి పిలుస్తోందా?"

"లేదుగాని భజన వినపడుతోందిగా లే..."

సుబ్బలక్ష్మికి జలుబు చేస్తే రుక్కు విక్స్ రుద్దుకుంటుంది. ప్రగాఢమైత్రి అయితే ఫరవాలేదు. కాని పులిని చూసి నక్కవాత పెట్టకోవడంతోటే వస్తోంది తంటా. దాని మొగుడు సివిల్ ఇంజనీరు. వాడు తన కొడుకును లండన్‌లో చదివిస్తాడు. కూతుర్ని అమెరికా అల్లుడికిస్తాడు. విజయవాడలోనే ఏం ఖర్మ బెంగుళూరులో, హైదరాబాదులో కూడా ఏకకాలంలో రెండంతస్థులు భవంతులు కట్టించగలడు. నీ పెళ్లాం నిన్ను అతడితో పోలిస్తే ఎలా? నువ్వెంత? నీ సంపాదనెంత? అనుకరణ జాడ్యం వదులుకో అని రుక్మిణికి నచ్చజెప్పడం తివిరి ఇసుమున తైలం తీసినట్టే.

''ఇవ్వాళ ఎన్ని పనులు... మర్చిపోయారా... ఈరోజు దీప్తి పుట్టినరోజు! క్లాస్‌మేట్లనీ, వీధిలో స్నేహితురాళ్లనీ పిలవాలంటోంది. పోతే పోనీ ఖర్చు. వెర్రిపిల్ల ముచ్చటపడుతోంది. వచ్చే సంవత్సరం ఎక్కడుంటామో... ఎలా వుంటామో... ఎవరికి ఎరుక. బేకరీకి వెళ్లి స్వీట్లు హాట్లు, కేకు ఆర్డరిచ్చిరండి ముందు...''

దీప్తి లేచింది. వెర్రిగా నవ్వుతోంది. పురిట్లోనే చస్తే పోయేది పీడ. ''నేనూ వత్తా వాకింగ్.''

పదకొండేళ్ల ప్రాయపు చెదరిన వీణ అస్పష్టంగా రవళిస్తోంది. తెల్లగా, ముద్దుగా, నిర్మలంగా నవ్వుతోంది.

బేబీ షామిలీ. అదీ ఆ చైల్డ్ ప్రాడిజీలాగే వుండేది. అయిదేళ్ల క్రితం దేవుడా ఏ పాపానికి ఈ శిక్ష? ఈ వెర్రి గొంతుకను ఒక్కసారిగా తెగనరకకపోయావేమిరా? నా చిట్టితల్లి కుందనపు బొమ్మ. ఈ భూమండలంమీద ఎక్కడున్నా ఈ నాన్న గుండెల్లో నువ్వుంటావ్. పూవులాంటి వొళ్లు ఆపిల్ బుగ్గలు. కలువరేకుల కళ్లు... ప్చ్. ఈ గొంతు నులిమేందుకు, ఈ చెవులు పిండేందుకు ఎలా మనసొప్పిందిరా గారడీ? మెనింజైటిస్ అన్నాడు స్థానిక డాక్టరు. సెరెబ్రో స్పైనల్ ఫీవర్ అన్నాడు స్పెషలిస్టు. అదృష్టవంతురాలు. ప్రాణాపాయం తప్పింది. కాని... కాని... శాశ్వతమైన మచ్చ. మెదడు దెబ్బతింది. స్వరం, శ్రవణం శక్తి కోల్పోయాయి. అన్ని పరీక్షలు... అంతా ఖర్చు... ప్రయోజనం శూన్యం. బి ఆప్టిమిస్టిక్, దట్సాల్.

''ఇంత చలిలో లేవద్దమ్మా. నీ బర్త్‌డేకి అందర్నీ పిలువ్. గ్రాండ్‌గా చేద్దాం. దిగు.''

''అయ్యో నా మతిమండా... మర్చేపోయాను. నిన్న రాత్రి సుదర్శనమన్నయ్య ఫోను చేశాడు. బొంబాయికి ట్రయిను రిజర్వేషను అయిందిట. ఇవ్వాళ ఉదయం పదిగంటలకు వచ్చేస్తున్నానన్నాడు... ఈ రాత్రి బస్సుకే కదా మీ ప్రయాణం? అంతేనా? ఆ... సంతోష్ ఉత్తరం రాశాడు. ఫీజు ఆఖరు తేదీ దగ్గర పడుతోందట... హౌజ్‌బిల్డింగ్ సంస్థవాళ్లు నోటీసు పంపారు. మూడో కిస్తీ కడితేగానీ డాబా మొదలెట్టరంట... ఆ డొక్కుకారు అమ్మారా లేదా?... ఎంత? ముప్పయి వేలేనా? ఏవీ...''

మాంచాల పతికి కర్తవ్యప్రబోధం చేస్తోంది... శశిరేఖ అభిమన్యుడిని పద్మవ్యూహంలోకి సాగనంపుతోంది... ఆధునిక జీవనంలో కనీసంగా ఉండాల్సిన అత్యల్ప అవసరాల్ని మధ్యతరగతి హిపోక్రసీ చర్వితచర్వణం చేస్తోంది. ఆశల హరివిల్లు వేపు బతుకు టుయ్యాల ఊపు... మొదట్లో మురిపెంగా, గర్వంగా చూసుకున్న నీ ప్రీమియర్ పద్మిని సెకండు హాండు, కొత్త మారుతికారు పక్కన డొక్కుదైపోయింది. అప్పుడది రుక్కు దృష్టిలో హోదా ప్రతీక. నీకు నెలకు ఆరువందలు అలవెన్సు ఇప్పించే బాతు. ప్రస్తుతం అది ఇరువురి దృక్కోణంలో పనికిరాని వస్తువు. స్కూటర్ ఎప్పుడో పిల్లల దుస్తులుగా, రుక్కు కొత్తమోడల్ చీరలుగా రూపాంతరం చెందింది. రుక్కు ఇంకా ఎన్ని ప్రణాళికలకు నమూనా గీస్తుందో?... ఇంకెన్ని వేల నిధులు కావాలో?... కొవ్వొత్తి ఇంకా ఎంతకాలం కాలాలో? రాబడి, ఖర్చు, నికరనిలువ, రుణం, కొరత, ఒక్కసారి బ్యాలన్సు చూడాలి... ఇవాళే ఇంటి నుండి దూరంగా పరుగు... ఎల్లుండి దేశం నుండే పరుగు. ఉడాన్... మళ్లా సంవత్సరం వరకు ఇటురావు... ఉత్తరాలే వారధి... ఒకసారి చెక్‌లిస్టు చూసుకోవాలి... ఏమన్నా మర్చిపోయావేమో.

''అన్నీ అమ్మాను. నేను అమ్ముడుపోయాను... ఇంకేమి అమ్మాలో చెప్పు... ఫ్రిజ్, కూలర్, బంగారం? ఈ ఇల్లు అమ్మడానికి వీల్లేదు సుమా... ఇది కంపెనీ వారిది. గ్రాట్యుటీ వచ్చేంతవరకు నువ్వు, నీ పిల్లలు మూడునెలలు ఇంటిని వాడుకోవచ్చు... లే... లే... నేను బయటికి వెళుతున్నాను... తలుపు వేసుకుందువుగానీ రా.''

''ఎవడొస్తాడు.. ఇంట్లో ఏం ధనరాసులున్నాయని దోచుకుపోతాడు...? కొడుకుని ఇంజనీర్ని చేశారా? కూతురికి డాక్టరల్లుడ్ని చూశారా... పునాదుల్లోనే ఉన్న ఆ ఇల్లన్నా పూర్తిచేశారా... ఎన్ని కిలోల బంగారం కొన్నారేమిటి... బోడిగాజులు, ఈ నెక్లెస్సేగా... చాల్లెండి, వేళాకోళం. ఒకసారి ఉత్తరాలు చూడండి. వాటి సంగతి తేల్చండి ముందు. మిగతా విషయాలు అన్నయ్య చూసుకుంటాడు. గానీ...''

అబ్బబ్బ... రుక్మిణిని కదిలిస్తే జోరీగల రొద. ఉత్త రొదయేనా? ఈ సొదలో ఏమన్నా అర్థముందా...? రోము నగరంలో రోమనులాగానే వుండాలని ఎందు కన్నార్రా ఫూల్? ఉండను ఫో అంటే odd man out. కుప్పలు తెప్పలుగా బుల్లితెర మీద గుప్పిస్తున్న ప్రక టనలు, వాటి ప్రభా వానికి లోనుకాని సమర్థుదారీ ఔరత్ కౌన్ హైరే? పోటీ పోటీ... వేగం... వేగం... సర్వత్రా వేగం. పాస్ కాదు... ర్యాంక్ ఎంత? ఎంత శాతం మార్కులు...? పిల్లలు చదువుకో వడం కాదుబే పిల్లల కోసం నువ్వు చదువు కొనుక్కోవాల్సిందే...

ఇదిగో డైరీ... ఒకసారి చెక్‌లిస్టు టిక్ చేసుకోవాలి. బ్యాంకులో ఎన్నారై అక్కవుంటు, రుక్కు పేర్న సేవింగు అక్కవుంటు తెరవడం, బ్లాంకు చెక్కుల మీద సంత కాలు చెయ్యడం అయిపోయింది. టిక్ చేసెయ్యి... స్వచ్ఛంద పదవీ విరమణకు సంబంధించిన అన్ని లాభాలూ క్లియర్. ఒక్క నలభైవేల గ్రాట్యూటి తప్ప... అన్నీ కలిపి లక్షాపదివేలు... ఓరి దరిద్రుడా... ఇంకా పద్ధె నిమిదేళ్ల సర్వీసు ఉంది. ఉద్యోగ విరమణ మూల్యం ఇంతేనా? భవిష్యనిధి ఎప్పుడో లాగేశావు... సెలవుల అమ్మకం రాబడి ఎప్పుడో నాకేశావు... ఎక్సుగ్రేషియా, ముప్పయినెల్ల వేతనం. ఆ రొఖ్ఖం హౌజుబిల్డింగులోను బకాయి కిందికి చెల్లు అయింది. ... మిగిలింది కారు లోను కిందికి పోయింది. సంతోష్ కోసం దీర్ఘకాలిక కోచింగ్ ఫీజు వాడి ఇంజనీరింగ్ ఉహాసౌధం కోసం వెయ్యాల్సిన పునాది రాళ్ల ఖరీదు పన్నెండువేలు ఆఖరు కిస్తీగా కట్టేశావు. రాజధాని నగరంలో రియల్ ఎస్టేట్ వారికి... రుక్కు మెదడులో మొలిచిన ఆశాసౌధం సంపన్నుల కాలనీలో మూడు గదుల ఇల్లు- అది ఇప్పటికే రెండు లక్షలు మింగింది- అపరాధ రుసుంతో సహా మూడోకిస్తీ యాభై అయిదువేలు రెండు డ్రాఫ్టులు నిన్ననే పంపించావ్. టిక్... బార్, బట్టలకొట్టు, కిరాణా షాపు, చేతి అప్పులు అంతా కల్సి పాతికవేలు... టిక్. ఇంక ముందున్న ఖర్చు... కార్యక్రమం, కుటుంబాన్ని సిటీకి ఎలా తరలించాలో? పిల్లల చదువులు ఏ కాలేజీ ల్లోనో? పంచవర్ష ప్రణాళిక పూర్తయ్యేవరకు కుటుంబం మకాం ఎక్కడో? ఇవన్నీ సుదర్శనంగాడు చూసు కుంటాడు. ఇంకా లోటు ఎంత...? ప్రయాణ ఖర్చు లకూ... కొత్త దేశంలో మొదటినెల గడవడానికీ కనీసం పదివేలు... ఏజంటు కమీషన్ ఒక నెల జీతం పాతిక వేలు... వెరిసి మొత్తం ముప్పయి ఐదువేలు. ఇది సుబ్బారావుగాడు సమకూరుస్తాడు. ఇవ్వాళ మధ్యాహ్నం లోగా తెచ్చి ఇస్తాడు. కారు, పాతషేరు సర్టిఫికెట్ల అమ్మకం వాడికే అంటగట్టావ్. అక్కౌంట్సు ఆఫీసరు అయినా బ్రోకరు బుద్ధి వాడిది... షేరల్లో మదుపుపెట్టి మస్తుగా సంపాదించాడు. చౌకబేరంలో చౌకబారు ఆలోచనలు చెయ్యడుకదా? ఎంతయినా మిత్రుడు, ఇప్పుడు ఆపద్బాంధవుడు. నమ్మక తప్పేదిలేదు. ఆ వెధవ షేర్లు... ఎవరెస్టు సిమెంటు, పెట్రో కెమికల్ లిమిటెడ్, మాస్టర్ గెయిన్, మల్టిప్లయర్ ప్లస్. ఎంతకు పోతేనేం. ఇరవైవేలకు వడ్డీ నష్టం ఇప్పటివరకు. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు.. గత జలసేతు బంధనం వద్దు... ఓటమి విజయానికి తొలిమెట్టు... ఇక ముందు మార్కెట్టును జాగ్రత్తగా గమనించు. ఎన్నారై కోటాలో ఫర్మ్ ఎలాట్‌మెంట్స్... కీట్సు అన్నట్టుగా విన్పించే రాగాలు మధురం. విన్పించనివి మరింత మధురం.

ఇంట్లోంచి బయటపడితే హాయి. అరే... బూట్లు ఎక్కడ చచ్చాయో... ఈ సైకిలు నెత్తి మీద పడేట్టు వుంది. సోఫా మీద మూత తెరచి వుంచిన జామెట్రీ బాక్సు... టీపాయి మీద టీ కప్పులు... పుస్తకాలు, నోటు బుక్కులు... మ్యాగజైన్లు... "రుక్కూ... నా బూట్లు... ఎప్పుడూ ఇక్కడే వుండేవికదా! పాత బూట్లని చెప్పి పనిపిల్లతో చెత్తకుండీలో గిరవాటేయించలేదుకదా?"

"కేకలు... లేసింది మొదలు... ఈ రోజన్నా ప్రశాం తంగా ఉండలేరూ... మీ పవర్ బూట్లు సంతోష్ తీసి కెళ్లాడు. గూట్లో అడుగున పాత కాన్వాస్ బూట్లుంటాయి చూసుకోండి. అయినా ఈరోజు ఎంత బిజీ మనం. సామాన్లు, ప్రత్యేకించి మీ లగేజి సర్దుకోవాలి. మిత్రుల్ని, బంధువుల్ని కలవాలి.. మీనార్ ఎక్సుప్రెస్‌లో మీకు వీడ్కోలు చెప్పేందుకు నేనూ, పిల్లలూ వస్తున్నాం. ఆ... దీప్తి పుట్టినరోజు గుర్తుంది కదా..."

నిర్లక్ష్యంగా పెంచిన వొళ్లు మెల్లగా కదలి వస్తోంది. తల్లి లక్షణాలు పుణికి పుచ్చుకున్న పిల్లలు... సంతోష్ బారెడు పొద్దెక్కేదాకా లేవడు. జాగింగ్ చేస్తాడా? అసలు వాడు సంక్రాంతికి రాకుండా వుండి వుంటే బాగుండేది! అయిదు వందలు ఖర్చు వృథా... జీనుపాంట్లు, డబుల్ బుల్ చొక్కాలు... అసలు వాడు చదువుతాడా? షోకి ల్లాలా తిరుగుతాడా? వెధవ డిగ్రీలో జాయినయినా పోయేది. కొడుకు ఇంజనీరే కావాలని తల్లి కోరిక... ఈసారి గన్‌షాట్‌గా సీటు తెచ్చుకుంటాడట... క్రితంసారి క్వాలిఫయింగు నంబరు కూడా రాలేదు మట్టిబుర్రకు. అబ్బ... దొరికాయి. గూట్లో అడుగున కాన్వాసు బూట్లు. ఈ స్థితిలో ఇంకా ఇంట్లో ఉన్నాయంటే అబ్బురమే! ఇవి... ఇవి... ఈ పత్రికలేమిటి? చెప్పుల గూట్లో మాగ

జైన్లు, వారపత్రికలు, సినీబ్లిజ్, ఫాంటసీ, సొసైటీ, డెబొనీర్. మాయాబజారా... మయసభా? సెంటర్ స్ప్రెడ్ సెక్సీ బొమ్మలు పిల్లలు చదువుతున్నారా? గోళ సంస్కృతిలో నక్షత్రపు మిణుగుర్లకు, ఎంటివీ మాంసపు ముక్కలకు ఈ బొమ్మలు మసాలా దినుసులు...

''రుక్కూ... నీకేమయినా బుద్ధి ఉందా? ఈ పత్రికలు వేరే పెట్టుకోవచ్చు కదా... పిల్లలవేవో, పెద్దల వేవో తేడా తెలీదా నీకు...''

''అయ్యయ్యో... గూట్లో ఉన్నవి బయటి కెందుకు తీశారండీ. టి.వి. చూడవద్దు, పుస్తకాలు చదవద్దు. బాగుంది మీ చాదస్తం. లోపల పడెయ్యండి. లైబ్రరీకి తిరిగి పంపిస్తానుగాని... ఇదిగో స్వెట్టరు... జలుబు తెచ్చుకునేరు సుమా...''

అప్పుడు రస్వంతి, రాధిక, రమణి, మన్మథ... ఇప్పుడు ప్లేబాయ్, పుస్సీక్యాట్, డెబొనీర్, వీటిని అనుక రిస్తున్న వారపత్రికలు... అందరికీ అందుబాటులో సెక్సీ పుస్తకాలు... మాధురి చదువుతున్నదేమో ఈ పత్రికలు? డర్టీ గర్ల్! సుదర్శనంగాడికి నొక్కి చెప్పాలి. దీన్ని క్రైస్తవ మిషనరీ లో, సన్యాసినులో పర్యవేక్షించే కాలేజీలోనే వెయ్యమని.

అదేమిటి...? వారపత్రికలో ఇన్‌లాండ్ లెటర్...? మాధురికి ప్రేమలేఖా...? ఎవర్రాశారో...

కాదు... నీకే తమ్ముడు రాసిందే... స్టాంపు చూస్తే నిన్నటి తేదీ.

''అన్నయ్యా నువ్వు వచ్చి వెళ్లిన మర్నాడే అమ్మ మంచాన పడింది. రక్తపోటు బాగా పెరిగిందన్నాడు డాక్టరు. కాలరీ హాస్పిటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచారు. కోలుకుంటుందంటున్నారు నర్సులు. అమ్మ కళ్లు తెరచినప్పుడల్లా నీ పేరే ఉచ్చరిస్తోంది. నా మనసు కీడు శంకిస్తోంది. జీవితంలో నిన్నేమీ కోరలేదు. ఈ కోరిక తీర్చు. ఒకసారి రా... వెంటనే రా.''

డైరీలో బొంబాయి నుండి నియామక ప్రతినిధి పంపిన రిజిస్టర్డు పోస్టు ఉత్తరం.

అందులో నీవు వెళ్లాల్సిన తేదీ, గంటలు, వీసా, ఫ్లైట్ వివరాలు...

చేతుల్లో ఇంటికి రమ్మంటూ తమ్ముడి లేఖ...

ఝూఁమ్... పంపు పూర్తి భ్రమణవేగంతో ద్రవాన్ని సంపూర్ణపీడనంతో నిర్దేశించిన ఎత్తుకు జారగొడుతోంది. విద్యుత్తు వినియోగ సూచిక ఎర్రమార్కు దాటుతోంది జాగ్రత్త... పంపు ఆగిపోతుంది. లేదా మోటార్ కాలిపో తుంది... ధన్... ధన్... ధనాధన్... కణతల దగ్గర రక్త ప్రసరణవేగం వేళ్లకు స్పష్టంగా తెలుస్తోంది. కత్తి అంచు మీద నిలబడ్డావ్. నైటింగేలు తన గుండెను ముల్లుకు గుచ్చి, రాత్రంతా పాడి తెల్లగులాబీని ఎర్రగా మార్చింది. జితేంద్రియుడును, ప్రశాంతుడునగు స్థితప్రజ్ఞుడు శీతోష్ణ ములకు, సుఖ దుఃఖములకు, సమ్మాన తిరస్కార ములకు, పరమాత్మయందే సమాహితుడై ద్వంద్వముల చేత చలింపడు... కరెంటు పోతోందా...? చీకటి ఏమిటి?... భ్రాంతి... కాళ్లకు నేల అనుతోందికదా... కంట్రోల్ యువర్‌సెల్ఫ్...

''నువు మనిషివా. రాక్షసివా? ఈ ఉత్తరం నిన్ననే ఎందుకు చూపించలేదు?''

ఎంట్రాపీ పెరుగుతోంది. డెల్టా ఎస్ ఈజిక్వల్టు డెల్టా క్యూ అపాన్ అబ్‌సొల్యూట్ టి... ఉష్ణరాశి, ఉష్ణో గ్రతల నిష్పత్తి పెరగనీయకు, ఉష్ణగతికశాస్త్రం ప్రకారం వ్యవస్థ అస్తవ్యవస్తమవుతుంది. ప్రక్రియను వెనక్కి మలుపు... ఇప్పుడు ఎవర్ని నిందించి ఏం ప్రయోజనం?

''ఏ ఉత్తరం...? ఎక్కణ్ణించి? నాకేం తెల్సు నండీ...? పోస్టుమాన్ రెండు ఉత్తరాలే వేశాడను కున్నాను. అది పిల్లలు తీసి పడేశారేమో...''

అబద్ధం... ఉత్తరాన్ని చింపి చదివినట్టుగా తెలు స్తోంది. కావాలని దాచి వుంచింది. స్వార్థంకోసం ఎవరు బలయిపోతేనేమి? డబ్బు దాహం ఎవర్ని ఆహుతి చేస్తేనేం? నువ్వు కళ్లకు గంతలు కట్టిన గానుగెద్దువి...

ఇనుపగజ్జెల తల్లి విసవిసాలోనికి వెళ్తున్నది. టుబి ఆర్ నాట్ టుబి? ఏది నిర్ణయం? ఏమిటి సమాధానం? ఒత్తిడి... టెన్షన్... అధిక పీడన ప్రభావానికి పది మిల్లీ మీటర్ల మందమున్న ఉక్కుగొట్టాలే బద్దలవుతున్నాయి. రక్తమాంసాల దేహంలో నీ నరాల గట్టితనం ఎంత?

రిలీఫ్ కావాలి... ఊపిరాడ్డంలేదు. కాలుష్యం... కార్బన్ మోనాక్సైడు మిలియన్‌లో వందపాళ్లు, తక్షణం అవతలికి పద... లేకపోతే చస్తావ్...

దీర్ఘమైన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు. గాలిలో తడిసిన గడ్డి, లిల్లీపూల పల్చటి వాసన... తుషార పాతం పాదరస మట్టాన్ని కిందికి నెట్టివేసింది. ఆరు సెల్సియస్ వుంటుంది కాబోలు... పైన లేత ఊదారంగు విస్తృతా కాశం నేపథ్యంలో కాంక్రీటు అరణ్యంలోని రెండం తస్తుల బంగళాలు పొగమంచు ముసుగులో దీప్తి గీసిన పిచ్చిబొమ్మల్లా ఉన్నాయ్.

గబగబ అడుగుల్లో తొందర...

పార్కువేపు రోడ్డు మలుపు దగ్గర వీధిలైటు. కాలిపోయి గుడ్డిగా మండుతోంది. భౌ... భౌ... భౌ... కుక్క ఒకటి పాలబూతు వెనకాల నుండి భీకరంగా లేచింది. నీవైపు కాదుకదా... జాగ్రత్త... దివాళాకోరు

కంపెనీ ఆసుపత్రిలో రేబిస్ నిరోధక వ్యాక్సీను ఉందో లేదో...? ఆ మద్రాసీ డిజియం ప్లాంటు స్టార్టపం ఆలస్య మయినప్పుడు ఇలాగే మొరుగుతాడు. ప్రమాదం జరిగినప్పుడు కోపోద్రిక్తులయిన కార్మికులు వాణ్ని తన్నడానికురికారు. కానీ పోలీసులడ్డుకున్నారు... చితక బాదాల్సింది గుంటనక్కను...

భౌ... భౌ కుక్క చెత్తకుండీ కెలుకుతున్న పందుల వేపు దూకింది... 'అన్నోయ్... కుక్క... ఓలమ్మో... వ్యాహ్...' కుండీలో కెలుకుతున్నది పందులు కాదు.. మనుషులే... చిరిగిన చొక్కాలు... చింపిరిజుత్తులు. పన్నెం డేళ్ల కుర్రాడు, వాడి చెల్లెలు. చెత్త కుండీల్లోంచి ఆశలు పోగు చేసుకుంటున్నారు.. పాత ప్లాస్టిక్ డబ్బాలు... ఇనుపరేకులు... పారేసిన చెప్పులు ఏరు కుంటూ వెంట తెచ్చిన పెద్ద గోతాముల్లో కుక్కుకుంటు న్నారు... ఆడీ... ఆడీ... నీయమ్మ... ఫో ఫో కుర్రవాడు రాయి విసిరాడు. కుక్క రెండడుగులు వెనక్కి వేసినట్టే వేసి మళ్లా మొరు గుతూ ముందుకొస్తోంది. దారిద్ర్యం అంటే కుక్కకూ అలుసేనా?... ఛూఢ్... ఫో. ఛల్ ఛల్ పెద్దరాయి ఒకటి అసంకల్పితంగా నీ చేతిలోంచి బలం గా గిరవాటు పడింది. కుక్క దూరంగా పారిపోయింది. ఏమిటీ... ఈ జాలి... సానుభూతి...! ఏమో... అవ్యక్తం. పసివాళ్ల చూపుల్లోని భావమూ అవ్యక్తమే. మెదడులో అట్టడుగున పడివున్న గతం కుక్కగొడుగుల్లా పెగు ల్చుకు వస్తోంది... నీ తమ్ముడు, చెల్లి చిన్నప్పుడు ఇలాగే వుండేవారు కదూ...? నల్లటి, బక్కపలుచటి వాళ్లు... తెల్లటి కళ్లు. తమ్ముడివే... వదులుగా ఉండే ఫ్రాకు చీమిడిముక్కు, పొట్టి జడలు, చెల్లెలు ఇలాగే వుండేది. బడికి పోతు న్నట్టుగానే ఉండి తమ్ముడు రోడ్డుమీద సైకిల్‌షాపులో మెకానిక్‌కు ఆసరాగా ఉంటూ నెలకు పదిరూపాయలు సంపాదించి అమ్మ చేతుల్లో పెట్టే వాడు. రాత్రుల్లో తనకూ, నీకు ఇద్దరికీ పక్కలు పరిచి, 'అన్నయ్యా, నువ్వు గోడ దిక్కు పడుకో. గ్రీజుమరకలు నీకంటుకుంటాయేమో... చొక్కా విప్పేస్తానులే... అనే వాడు. బడికి క్రమం తప్పకుండా పోయే నీవు నీటుగా ఆరోగ్యంగా ఉండాలనీ, బాగా చదువుకోవాలనీ ఇంట్లోని వారందరూ కోరుకునేవారు... చెల్లి అమ్మ వెంట వెళ్లేది పగలు. అమ్మ కాలరీ మందుగుండు గోదాము దగ్గర ఇతర స్త్రీ కూలీలతో కలిసి ప్యాకింకు మట్టి ఉండలు చేసి, మేస్త్రీకి అప్పజెప్పి, వస్తూవస్తూ దొరల బంగళాల్లో అంట్లుతోమి, చీకటివేళ ఇల్లు చేరేది. వండి, వార్చి పిల్లలకు పెట్టి తాను ఇంత బుక్కి నడుం వాల్చేది. అప్పు డప్పుడు దొరసాన్లు ఇచ్చిన మిగిలిన కూరలు అమ్మ ఇంటికి తెస్తే వాటిల్లో మంచివీ, రుచి కరమైనవి నీకే... మిగతావాళ్లకు పచ్చడి మెతుకులో... పాచి అన్నమో... చెల్లి నీ పుస్తకాలు సర్దిపెట్టేది. నువ్వు కిర్సనాయిలు బుడ్డి దీపం దగ్గర రాసుకుంటూంటే చెల్లి నీ పెన్నును అద్భుత వస్తువును చూసినట్టుగా చూసేది... పెన్నును తానే పదిలపర్చుతూ, అడిగిన వెంటనే తెచ్చి ఇచ్చేది. అన్న బాగా చదువుకుని ఆఫీసరయితే తాను రాకుమారుడితో కల్సి రెక్కలు గుర్రం మీద విహరించ వచ్చుని కలలు కనేదేమో పిచ్చిపిల్ల.

దారిద్ర్యం ఎంత దుర్భరమైనా కుటుంబసభ్యుల మమతానురాగాలు చల్లటి లేపనంగా తోచేవి. పేదరికం నిన్ను ఎన్నిరకాల అవమానాలకు గురిచేసిందో గుర్తు లేదూ...? షావుకారి కొడుకు మార్కండేయులు తన పుట్టినరోజులకు క్లాసులో వాళ్లందరినీ పిలిచాడు. నీకు మాటమాత్రంగానైనా చెప్పలేదు. తొమ్మిదో తరగతి పరీక్షల్లో లెక్కల పేపర్లో నీకు అరవై, తప్పులు చేసిన ప్పటికినీ ఓవర్‌మన్ కొడుకు వేణుగాడికి ఎనభై మార్కులు. ఇదేమిటి సార్ అని మాస్టారికి చూపెడితే నన్ను అడిగే మొనగాడివా అని నిన్ను కొట్టాడు. ఓసారి కడుపులో నొప్పిగా వుంటే, మానిటర్ వేణుగాడికి చెప్పి ఇంటికి వెళ్లిపోతే, వాడు నీమీద టీచరుకు చాడీలు చెప్పి మర్నాడు క్లాసులో నువ్వు గుంజీలు తీసేలా చేశాడు. పదోతరగతిలో ఉన్నప్పుడు స్కూల్ డే నాడన్నా మంచి బట్టలు వేసుకురారా దరిద్రుడా అని హెడ్‌మాస్టారు నిన్ను ఎర్రటి ఎండలో ఇంటికి తరిమివేశాడు.

నీ పదోతరగతి పూర్తయ్యాక మేనమామ అమ్మతో అన్నాడు. "అక్కా ఇంకెన్నాళ్లు రెక్కలు ముక్కలు చేసు కుంటావ్? పిల్లవాడు ఎదిగాడు. ఇంకా ఏమీ చదివి స్తావులే. వీడిని బొగ్గుగనిలో పనిలోకి దింపుదాం..."

అమ్మ తల అడ్డంగా ఊపింది. "నా గొంతులో ఊపిరి ఉండగా నా కొడుకును బొగ్గుపొరల్లోకి పంపను గాక పంపను. వీడి తండ్రిని నమిలిన రాకాసికోరలకు ఈడినీ అప్పగించడానికి నా చేతులురావు అన్నయ్యా..." అంది దృఢంగా.

నాన్నను తల్చుకుని అమ్మ ఎన్నోసార్లు గుండెలు అదిరేలా ఏడ్చింది. నాన్నను ఆఖరుసారిగా చూసిన ఆ రాత్రి పీడకలలా ఇంకా గుర్తున్నది. వేసవికాలం గుడ్డి వెన్నెల రాత్రి కుటుంబమంతా ఇంటి ముందు ఆరు బయట పడుకున్నారు. తెల్లవారుఝాము మూడు గంటలప్పుడు బూడిదదిబ్బ దిగువన కంకర రోడ్డు మీద ఆగిన కాలరీ ఆస్పత్రి అంబులెన్సు రొద అందరికీ నిద్రా భంగం కల్గించింది. అంబులెన్సులోంచి నలుగురు

కార్మికులు దిగి, స్ట్రెచర్ మోసుకుంటూ వచ్చి వాకిట్లో దించారు. తెల్లటి కఫన్‌మోస్తూ నల్లటి వ్యక్తులు. వాళ్ల టోపీలకు లాంపులు.. నిక్కర్లకు బెల్టు బ్యాటరీలు. బొగ్గుపొడి... చెమట కలగలిసిన వాసన చిమ్ముతూ మసక వెలుతురులో ఆ క్రీనీడలు ఒక క్షణం మౌనంగా నిలబడ్డాయి.

'అక్కా గుండెదిటవు చేసుకో. దేవుడు నీకు అన్యాయం చేశాడు.'

నూతిలోంచి ఎండిన డొక్కలోంచి వచ్చిన గుర గుర ధ్వనిలా ఉందా స్వరం. అమ్మ చేతులు కంపిస్తూ తెల్లగుడ్డను తొలగించాయి. చిన్నాభిన్నమైన నాన్న శరీరం. ఘాటుగా, గంధకంలాగా అదోరకమైన గంధం...

'మమ్మల్ని ఏం గతిచేశావు నాయనో...'

అమ్మ గుండెలు బాదుకుంటూ నాన్న శవంమీద కుప్పకూలిపోయింది. ముందు నిలబడ్డ పొడవాటి క్రీనీడ గొంతుక నిర్వేదంగా పలికింది. బొగ్గు తోడుతున్నప్పుడు కప్పు కూలింది. పెద్ద బండ అడ్డం పడింది. మేము ఇటు అతడు అటు మొత్తం పాయ మూసుకుపోయింది. బ్లాస్టింగు తప్పనిసరి అయింది.

అనివార్యాలు... అనాలోచిత తప్పిదాలు... పరిస్థితీ ప్రభావాల అవిచ్ఛిన్నత... మొత్తం జీవితాన్ని ఒక సమీకరణంలోకి కుదించాలనుకుంటే ఇంకెన్ని గుణిజాలు చేర్చాలి.

ఉష్ణ, ద్రవ్యరాశుల మార్పిడి సూత్రాలకు మల్లె మానవుని సామాజిక జీవితాన్ని ఒక సూత్రంలో బంధించడం సాధ్యమా? అవరోధాలు... అనుల్లంఘనీయాలు... నీ రక్తప్రవాహంలో సంకోచం... అందుకే డయాస్టోలిక్ పీడనం వంద... నడువ్... వేగం పెంచు...

ఛూఁహ్మ్... కీప్‌లెఫ్ట్... పెద్ద కాంతి శంకువొకటి ఉరుమును రోడ్డుమీద సమాంతరంగా లాక్కుంటూ వెళ్తోంది. చెవుల్లో ఫిరంగి గర్జన... ధ్వనికాలుష్యం.

కంప్రెసర్ల దగ్గర రోజూ పదహారుగంటలు. ఓవర్ టైముల కక్కుర్తిలోపడి డ్యూటీ చేసిన సుబ్రహ్మణ్యం గాడికి చెవులు బొత్తిగా పోయాయి.

సర్వత్రా కాలుష్యం... ఈ పరిశ్రమలో పదేళ్లు పని చేస్తే చాలు. జీవశాస్త్ర గడియారం విధి తల్లక్రిందులవుతుంది.

పారిశ్రామిక సురక్షాదళం గార్డు వ్యానుదిగి టౌనుషిప్పు మెయిన్‌గేటు అవతలి ఉడిపి హోటల్‌లోకి వెళుతున్నాడు. హోటల్లోంచి కమ్మటి ఆలుగడ్డ కుర్మా వాసన గాలిలో దిట్టంగా తేలివస్తోంది. పద... పద... ఎదురుగా తిన్నని రోడ్డుమీద అరఫర్లాంగు దూరంలో నల్లటిమేఘం... అసలు వీధిదీపాలుగా సోడియం వేపర్ లాంపులు పెట్టాలి. శీతకాలం... మేఘంలోంచి స్త్రీల కిలకిలరావం. అప్నార్ శరీర్కె మెద్ బిహిన్ ఎబోంగ్ సాతేజ్ రాఖార్ జాన్యాకీ అప్నె కొరీన్... అహాఁ ఏం అమాయకపు ప్రశ్న... వంట్లో కొవ్వు కరగాలంటే ఈ నాజూకు వాకింగ్‌లు, మందులు అవసరం లేదమ్మా... రోజూ ఇంట్లో నీ పని నువ్వు చేసుకో... కసవు ఊడువు... బట్టలుతుకు... అంట్లుతోము... చాలు...

సింద్రీలో రెండేళ్ల ట్రైనింగు... మెస్‌లో బెంగాలీ వంటవాడి చేతిలో ఎప్పుడూ ఒకే రకం వంటకాలు... ఉప్పుడు బియ్యపన్నం, చప్పటి పల్చటి పప్పు, ఆలు బాజీ, టిఫిన్లు మొహం మొత్తేవి... పూరీ, సమోసా కఛోరీ... ఆవాలనూనె వాసన మొదట్లో అసహ్యించుకున్నా తరువాత్తర్వాత అలవాటయింది. ట్రయినింగులో చేరేందుకు వెళ్తున్నప్పుడు అమ్మ రైల్వేస్టేషన్‌లో నిన్ను కావలించుకుని భోరుమని ఏడ్చింది. ఎక్కడి కలకత్తా... ఎంత దూరం... పోను మూడురోజులు... రాను మూడు రోజులు... చలి విపరీతం... తిండిపడదు... ఏమన్నా అయితే వార్త తెలియదు... పిల్లవాడికి ఇంకా మీసకట్టు మొలవలేదు. ఇంటర్మీడియట్ చదువన్నా పూర్తికాలేదు. ఇక్కడ పని దొరకదా... అంత దూరం పంపిస్తున్నావే మమ్మా నీ కొడుకును... ఇరుగు పొరుగువాళ్ల వ్యాఖ్యానం, వారింపు..

ఇంగ్లీషు మాస్టారు కలగజేసుకుని వివరించాడు. కలకత్తా అయినా కాశ్మీర్ అయినా మనదేశంలో భాగాలే. ఇప్పుడు రవాణా సౌకర్యాలు బాగా వృద్ధి చెందాయి. మీరు అనవసరంగా బెంబేలుపడి పిల్లవాడ్ని అదరగొడ్తున్నారు. డిగ్రీలు చదువుకుని ఉద్యోగం కోసం కాళ్లరిగేట్టు తిరగాల్సిన ఈ రోజుల్లో మంచి అవకాశం మీ గుమ్మంలో కొచ్చింది. సంతోషంగా సాగనంపండి.

మేనమామ అమ్మను ఓదార్చి సముదాయించాడు. మనవాడికి మంచి భవిష్యత్తు ఉంది. రాకాసి బొగ్గు గనులకు దూరంగా నీ కొడుకు ఉండాలన్న నీ కోరిక ఫలిస్తున్నందుకు హాయిగా నవ్వు అక్కా... ట్రైనింగ్ తర్వాత మన రాష్ట్రంలోనే ఉద్యోగమవుతుంది వీడికి. చక్కటి కేంద్ర ప్రభుత్వం ఉద్యోగం.

అలా సాగనంపిన నీవాళ్లు, నీవు జీవితంలో చాలా దూరం వాళ్ల కలల, ఊహల, ఆశల పరిధి దాటి అందనంత ఎత్తుకు ఎదిగిపోతావని అనుకుని ఉండరు. బయటి ప్రపంచం చూసొచ్చి నాగరీక సమాజంతో సహజీవనం చేస్తున్న బావ ఆలోచనాసరళి చాలా విశాలమైపోయిందనీ, అందమూ, విద్యాగంధమూ లేని

తన నిసర్గలక్షణాల మూలంగా తన ఉనికి అందులోంచి జారిపోయిందనీ తెల్సుకున్నాక, కొన్నాళ్లు కుమిలి, తరువాత తేరుకుని చిన్నతనాన్నుంచీ పెంచుకొస్తున్న 'బావ నా సర్వస్వం' అన్న భావనను తుడిపేసుకుని తండ్రి కుదిర్చిన పెళ్లి చేసుకుంది నీ మరదలు.

అప్పుడెప్పుడో చెల్లి పెళ్లి సందర్భంలో అంది, 'బావా, నువ్వు ఇంతగా మారిపోతావనుకోలేదు.'

ఆ ఒక్క వాక్యంలో, ఒక్క క్షణకాలపు చూపులో ఎంత భావం! నిష్ఠురత, ఎగతాళి, అసహ్యం.

వీటి సాంద్రత కొలిచేందుకు నీ ఇంజనీరింగు గణిత పరిజ్ఞానం సరిపోదు...

నీకు ఇరవై ఏళ్లకే పర్మనెంట్ ఉద్యోగం, టౌనుషిప్‌లో అన్ని సదుపాయాల క్వార్టరు... ఇరవై రెండేళ్లకు పెండ్లి... నీ కలల ఊర్వశి విమ్మి కాదు. లీనా చందావర్కార్‌లాంటి అందమైన, చదువుకున్న, సంపన్న కుటుంబంలోంచి వచ్చిన భార్య... ఆధునిక శైలిలో ఆనందమయ సాంసారిక జీవితం... పాతికేళ్లకు ప్రమోషన్... భార్య ప్రోద్బలం, అత్తవారింటి హోదాతో పోల్చుకున్నప్పటి పోటీ స్ఫూర్తితో ఇంజినీర్స్ ఇనిస్టిట్యూషన్‌లో అసోసియేటెడ్ మెంబర్‌షిప్ పూర్తిచేశావు.

సమయానికి టంచనుగా వరించిన నాల్గు ప్రమోషన్లు వరుసగా... సి-క్లాసు క్వార్టరులో అసిస్టెంటు ప్లాంట్ ఇంజనీరు అంతస్తు... త్వరలో పై అంతస్తుకి మార్పు, అతి శీఘ్రమైన మార్పు.

పనిమనిషి కొడుకు ఎదిగి ఎదిగి ఇంట్లో పని మనుషులను పెట్టుకునే దొర స్థాయికి వచ్చాడు.

మార్పుతోపాటే వెన్నంటి వస్తున్న పరాయీకరణ... రక్తసంబంధీకుల నుండి పరాయీకరణ... నీ నుండి నీవే పరాయీకరణం చెందావే. నీ ప్రమేయమేమీ లేదు. ఆత్మవంచన చేసుకోకు అల్పబుద్ధీ! చదువు, సంస్కారం, ఉన్నతోద్యోగాలు కలబోసుకున్న మూర్తిమంతం. అన్నయ్య ఘుమఘుమలాడే నేతి మిఠాయి... కాని ఆ మిఠాయి అంగడి షోకేసులో గాజు తలుపుల వెనకాల వుంది. ఎంత చూసినా, ఎంత వేచినా అది మనకు అందదు. పద అనుకుని నిరాశగా వెనక్కి మరలి ఒకరి కన్నీరు మరొకరు తుడుచుకుని ఉంటారు తమ్ముడు, చెల్లి. నీరుపోసి పెంచి పెద్ద చేసిన చెట్టు పుష్పించే సమయానికి వేరు పురుగుకు గుర్తై ఎండిపోతోంటే, వాకిలి అంతా చెద వ్యాపిస్తూంటే, మానును సమూలంగా నరికివేసి, అవతల పడేసినట్టుగా అమ్మ నీ ఊసునూ, నీ జ్ఞాపకాల్నీ తలలోంచి చెరిపేసుకొనుంటుంది...

సారీ టా ఖూబ్ సుందర్... వెల ఎంత. ప్రైసు... ప్రైసు... పంజాబ్ సింధు గుజరాత మరాఠా ద్రావిడ ఉత్కళ వంగా... రోడ్డు మీద బృందగానం ఆలాపన... నాన్‌స్టాప్‌గా వాకింగ్ అండ్ టాకింగ్... రెండు శిక్షల్ని ఖైదీ ఏకకాలంలో అనుభవించాలి. అస్పష్టంగా నాలుగు ఆకారాలు కారుమేఘంలోంచి చైతన్యం పుంజుకున్నాయి. ఆజ్ ఖూబ్ ఠండా... శాలువా మర్చిపోయాను. ఎదురుగా కోమలాంగుల గుంపు... రెండు పూలరెమ్మలు. ఒక గున్నమావి, ఒక సుమోవస్తాదు. ఇక్కడి ఆడవాళ్లకు చీరల గురించి నగల గురించీ తప్ప వేరే ఆలోచనే లేదా? హమార్ ఠండా లేగేజాతె పారె... రుక్కు ప్రేమగా స్వెట్టర్ వేసుకొమ్మంది... మర్చిపోయావ్. ధనపిపాసకు ఎంత దూరదృష్టి? చలి నిజంగా ఎక్కువే... అదరగొడుతోంది. జూవల్ థాంప్సన్ లేక కొర్ల్ వాన్ లిండె నో... దిగంతాల వెనకాల నక్కి బ్రహ్మాండమైన బ్లోయర్ గుండా గాలిని ద్రవీకరించి వదుల్తున్నారు. మెర్క్యురీ దీపం పొగమంచు వలయంలో ఎలక్ట్రాన్ మేఘాన్ని ప్రస్ఫుటంగా ప్రదర్శిస్తోంది. అవతలి స్థంభం మీది దీపం హైజెనుబర్గ్ అనిశ్చిత సిద్ధాంతాన్ని గుర్తుకుతెస్తోంది. కలకల కిలకిల రావం దూరమైపో యింది. పొగమంచు తరగలమీద పరిమళం జాడ... పార్వతి కేశపాశంబున సహజ గంధమ్ముండున్. పాపం... నత్కీరుడు... కవిగా ప్రతిభాసంపత్తులుండీ అధికార దౌష్ట్యానికి బలయిపోయాడు. నువ్వూ అంతే కదా! ఊహూ... ఏదో వాసన... ఆఘ్రాణశక్తి అందుకుంటోంది. ఇంకేదో గంధమ్... మైధున గంధమ్... తెల్లవారుఝామున కక్కుర్తి... ఎవడో వాడు... ఔనుమరి వింటర్‌లో ఒంటరిగా పడుకోవడమేమిట్రా బేవకూఫ్... నెలరోజుల్నుండి కోరిక ధ్యాస లేదు. రెండుసార్లు మాత్రం... అదీ రుక్కు ప్రోద్బలంతోటే... నో థ్రిల్... పక్కలో తవుడు బస్తా.

నీలం రంగు లంగా, ఎర్ర జాకెట్టు, ఎర్రవోణీ, మల్లెచెండు తురిమిన బారు జడ. ఆహా... పెళ్లి చూపులప్పుడు రుక్కు అచ్చం దివి నుండి దిగి విరిసిన పారిజాతంలాగానే కనబడింది. కాని... ఇప్పుడు వయస్సు పెరిగిన కొద్దీ, ప్రౌఢత్వపు హుందాతనానికి బదులు హోదా తెచ్చిన అలసత్వం ప్రాబల్యం ఎక్కువయి శరీరాకృతి మారిపోయింది. సౌష్టవం కొవ్వును ప్రోగుచేసుకుంది... జాజిమల్లె, చామంతి, ముద్దబంతి, చివరికి సూర్యముఖి! ఇదీ రూపాంతర క్రమం.

ఇప్పుడు నడుంనొప్పి, మోకాళ్ల వాపు అంటోంది. డాక్టరు లావు తగ్గించుకోవాలనీ, మధుమేహం వచ్చే అవకాశమున్నదనీ హెచ్చరించాడు.. కొద్దిగా శారీరక శ్రమ, కనీసం మార్నింగ్ వాక్‌కు రమ్మన్నా రాదు, ఆ గెడ్డం స్వామి జై భగవాన్ బొమ్మను పూజిస్తూ భజన

చేస్తూంటే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని సుబ్బలక్ష్మి నొక్కి వక్కాణించిందట. సుబ్బలక్ష్మి ఆరోగ్యానికి, ప్రత్యేకించి ఆమె ఐశ్వర్యానికి భగవాన్‌గారి పూజలే కారణమని రుక్కు ఉవాచ.

ఖర్మ ఖర్మ... రెండుసార్లు బలవంతంగా వాకింగ్‌కి తీసికెళ్లితే హాఛ్... హాఛ్... తుమ్ములు... ఆయాసం. ఎలర్జీ ఎలర్జీ... హిస్టామిన్ల ఉత్పత్తి మూలంగా సాధారణ ఎలర్జీ వస్తుంది. కాని రుక్కుకు ఇంకోరకమైన పెద్ద ఎలర్జీ వుంది... రుక్కుకు పేదవాళ్లు కనబడితే ఎలర్జీ ముంచుకొస్తుంది. పేదరికం, లేమి అన్న పదాలు ఉచ్చరిస్తేనే ఆయాసం ఎగదన్నుకొస్తుంది. ఎప్పుడూ హోదా, అంతస్తు, డబ్బు, సంపాదనల గురించిన ఆలాపన... ఇవి తను అంచనా వేసుకున్న స్థాయికి ఒక్క అంగుళం దిగువన ఉన్నా, ఆ భావనే గుండెదడ కల్గిస్తుంది.

అత్తగారింటి వాళ్ల పొడ అంటేనే కంపరం... వాళ్లు అడవి వాతావరణపు అనాగరిక సంస్కృతిలో పుట్టినవాళ్లట. నీ తమ్ముడు నీ దగ్గర ఉన్నా మూడేళ్లు మూడు యుగాలుగా భరించింది. వాడు ఇంటర్మీడియట్‌లో తప్పినప్పుడు, 'వీళ్లకు చదువు అబ్బదు, డబ్బు దండగ చెయ్యొద్దు. మన పిల్లల భవిష్యత్తు మనం ఆలోచించుకోవాలి,' అని హితబోధ చేసింది. చదువుకు స్వస్తి చెప్పి వాడు క్యాజువల్ కార్మికుడుగా పనిలో కుదిరితే, 'మీ వారు పెద్ద ఆఫీసరు, మీ మరిది కూలీపని చేసుకోవడమేమిటీ అని నా స్నేహితురాళ్లు అంటుంటే నాకు అవమానంగా ఉంటోంది. అయినా మీ తమ్ముడు ఎంత కాలం ఇలా తాత్కాలికంగా కూలీ చేసుకుంటాడండీ! అక్కడ మీ అమ్మను పని మాన్పించి, ఆ పనిలోకి ఇతగాడ్ని ఎక్కిస్తే ఎంచక్కా పర్మనెంటు ఉద్యోగి అయిపోతాడు. పెళ్లి చేసేస్తే జీవితంలో హాయిగా స్థిరపడతాడు,' అని సూచించి, ఆ సూచన అమలయ్యే వరకు నిద్రపోలేదు.

అమ్మ, చెల్లి ఇక్కడ ఆరునెలలు కూడా ఉండలేకపోయారు. లేడీస్ క్లబ్బులో రుక్కు స్నేహితురాళ్లు చెల్లిని చూసి, 'మీవి సోషలిస్టు భావాలనుకుంటాను. పనిపిల్లను కూడా కుటుంబసభ్యురాలిగా ట్రీట్ చేస్తున్నారు,' అని రుక్కుతో అన్నప్పుడు గర్వంగా తలవూపి నవ్విందట.

చెల్లి ఈ సంగతి అమ్మకు చెప్పుకుని ఏడ్చింది. రుక్కుతో నువ్వు కటువుగా మాట్లాడిన సందర్భాలు బహు కొన్ని. ఆ కొన్నింటిలోకి మరొక్కటి చేరింది. గొంతులో హాలాహలం దాచుకుందేమో రుక్కు తన వళ్లుమంట శాశ్వతంగా తగ్గించుకునేందుకు దివ్యౌషధం వెతుక్కుంది. ఓ వేకువఝామున అర్జంటుగా నిద్రలేపి, నిన్ను గేటుబయటికి లాక్కొచ్చి వీధి చివర యూకలిప్టస్ తోటవేపు చూపెట్టింది.

చేతిలో చెంబుతో అమ్మ తోటలోంచి వస్తోంది. బహిర్భూమికి బయటికి వెళ్లడం అమ్మ అలవాటు... ఆ భారతీయ గ్రామీణ అలవాటు మానడం ఆమె తరంకాదు.

'అయ్యో, అయ్యో ఎంత అప్రదిష్ట ఎవరి కంటనయినా పడితే తల కొట్టేసినంత అవమానం. ఈ అనాగరిక సంతతో నేను వేగలేను. ఈ ఇంట్లో నేనయినా ఉండాలి. వీళ్లయినా ఉండాలి అంతే.' రుక్కు భీష్మించుకుంది.

చివరకు నీవు అర్థం చేసుకున్నదొక్కటే నీ వాళ్లు పట్టణ వాతావరణంలో నప్పరు, వాళ్ల ఉనికి రుక్కుకు నచ్చదు, కాబట్టి నీ వాళ్లు నీవుంటున్న ప్రపంచపు ధగధగ నుండి దూరంగా తమ స్వంత దీవికి తాము వెళ్లిపోక తప్పలేదు.

రక్తపాశం లాగినప్పుడు నువ్వే అటు వెళ్తుంటావ్... చెల్లి పెళ్లికి నీ వంతు బాధ్యతగా పదిహేను వేలు రుక్కుకు తెలీకుండా ఇచ్చావు అమ్మకు. నీ ఈ స్థానానికి నీ వాళ్లు పునాదిరాళ్లు మోసినందుగ్గాను కూలీ రేటు ఇచ్చి చేతులు దులుపుకున్నావా కృతఘ్నుడా? కావచ్చు. నవ్విన నాపచేను పండుతుందని రుక్కుకు తెలీదు పాపం. తమ్ముడు కాలరీలో ఇప్పుడు ఓవర్‌మెన్, బావ మైనింగ్ సర్దార్... గౌరవప్రదమైన ఉద్యోగాలు. వాళ్ల ఉద్యోగ భద్రత అత్యంత పటిష్టమైనది. మరి నీది బీటలువారి కుప్పకూలింది.

వేగం పెంచు. చెమట రావడంలేదు. నడుస్తూ కూడా ఒత్తిడి కలిగించే ఆలోచనలేమిట్రా? గాఢాలోచనలకూ రక్తపోటుకూ అవినాభావ సంబంధం. జాగ్రత్త. రొచ్చు నుండి దూరంగా... ఎవే ఫ్రం ద మాడింగ్ క్రౌడ్... పయనమా... పలాయనమా...? చలి నిజంగా రక్తం గడ్డ కట్టించేలా వుంది. వెధవ పాత బూట్లు వేసుకోకున్నా పోయేది... అడుగు అరిగిపోయింది. కాళ్లకు నేల తాకుతోంది. వేగం తగ్గించకు. చలి పట్టు బిగుసు కుంటుంది. మెల్లగా జాగింగ్ ప్రయత్నిస్తే... స్లో... వేరీ స్లో. అంతర్గత ఉష్ణశక్తి పెరుగుతుంది. చలి పారిపోతోంది. ఎంతాల్పీ హెచ్ ఈజ్ ఈక్వల్టు యుప్లస్ పివి. పని, ఉష్ణరాశి, అంతర్గతోష్ణం, ఎంతాల్పీ, పీడనం, ఘనపరిమాణాల సమాహారం... అది సైన్సు... నీ నిజజీవితంలోకి వస్తే నీ తాపత్రయం సుఖప్రదమైన అవస్థ, చీకు చింతాలేని భవిష్యత్తు... ఆ దశ 'సి' అనుకుంటే దట్ ఈక్వల్టు మనీ

ప్లస్ ఎస్సెట్స్ మల్టిప్లైడ్ బై కంప్లీటెడ్ టార్గెట్స్... అను కున్నవి సాధిస్తేనే నీకు ఆరామం... చాలారోజుల విరామం... వాకింగ్ రోజువారి క్రమం తప్పింది. జాగ్... కీపిట్.. ఆయాసం తెచ్చుకోకు.. వేగం... నిరోధకం ముందున్నది నిదానంగా పొమ్ము. అల్లాహెూ అక్బర్... అల్లల్లా రసూలల్లాయ్... సుమారు వందయాభై... డెసి బెల్లుల శబ్దతీవ్రతతో మోగుతోంది మసీదుపై మైకు... జుమ్మా సంరంభం.

సౌదీ అదేబియాలో అన్నీ తట్టుకోవాలిట... చలి... వేడి... యాభయి డిగ్రీల వేడి... సున్నా డిగ్రీ చలి... వర్షం అరుదు. కంప్యూటర్ ఇంజనీరు ఖాన్ చెప్పాడు గదా! అక్కడ అమల్లో ఉన్నవి ఇస్లామిక్ న్యాయసూత్రాలట. బుర్ఖా లేకుండా స్త్రీ అవతలికి రాదు... వినోద కాల క్షేపానికీ, మనోరంజనానికి అవకాశాల్లేవు. థియేటర్లు, బ్రాంది షాపులు ఉండవు.. లేకపోతేమానె బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, ఇప్పుడు వాన ప్రస్థాశ్రమమనుకో... ఎల్లుండి బొంబాయినుండి ఫోను కొట్టాలి. టెహరాన్‌లో రిసీవ్ చేసుకొమ్మని. బాబ్రీమసీదు విధ్వంసం తర్వాత అక్కడ హిందువుల పట్ల వివక్ష పెరిగిందిట... జాగ్రత్తగా ఉండా లిట... డబ్బు సంపాదన లక్ష్యంగా వెళుతున్నపుడు మతాల గురించి చర్చలెందుకురా మూఢుడా. ఇంటి మీద బెంగ మూడురెట్లు పీడిస్తుందట. ఇక్కడే విపరీత మైన బెంగ బాధిస్తోంది. అక్కడే ప్రశాంతత లభిస్తుంది.

ఆ సైకతసీమకు వెంటనే ఎగిరి వెళ్లి, ఒయాసిస్సు దాపున విశ్రమించి ఉమర్‌ఖయ్యాం గజళ్లు, గాలిబ్ రుబాయత్‌లు వల్లెవేసుకుంటే ఎంత హాయి. ఒంటరి తనం అనే సాకీ పరిష్వంగం కావాలి. రుక్కుకు నెలనెలా డబ్బు మూట పంపిస్తేచాలు, నీ యోగక్షేమాలు వాళ్లకు, వాళ్లను గురించిన చింత నీకెందుకు? ధనమూల మిదమ్ జగత్. అక్షరాలా సత్యం. అనుబంధానికీ, ఆత్మీ యతకూ కొలబద్ద ధనమే. సర్వం త్యజించి కాషాయం కట్టుకున్నోడే అదృష్టవంతుడు. గమ్మత్తు. పిచ్చిముండా కొడుకులు వాడి కాళ్లు పిసుకుతూ లక్ష్మీ కటాక్షం దేహీ అని ప్రాధేయపడతారు. భౌతిక లంపటం తీర్చుకునేం దుకు ఆధ్యాత్మిక స్వాముల నాశ్రయించడం... చిత్రమైన వైరుధ్యం! ఈ గెడ్డం స్వాములు మాయలో పడకురా మానవా అని ప్రవచిస్తూనే బడాబడా వ్యాపారవేత్తలనూ, కుటిల రాజకీయ నాయకులను తమ శిష్యగణంగా చేరదీస్తారు. ఎలక్ట్రాన్ వేగాన్ని కనుక్కుంటే దాని స్థానాన్ని పట్టలేం. స్థానం పడితే వేగం కనుక్కోలేం... గాడ్ డజ్ నాట్ ప్లే డైజ్... దేవుడు జూదరి కాదు. కాకపోవచ్చు. కాని ఈ జూదగాళ్లు ఆయన పేరు ముంచుతున్నారు కద... ద్వైదీభావం శమించుగాక... ఆ బండ పెదవులు కప్ప ముఖం ఛీఫ్‌గాడు ఈమధ్య రుద్రాక్షమాలలు ధరిస్తున్నాడు. పోయిన నెల గుండెనొప్పి వచ్చి హాస్పి టల్లో పడ్డాట్ట. వెధవ చస్తేనేం బతికితేనేం. బతికి వుంటే భూమికి భారం, కంపెనీకి నష్టం. నిన్న డిపార్టుమెంటు వాళ్లు నీకు ఇచ్చిన వీడ్కోలు పార్టీలో ముఖ్య అతిథిగా వచ్చి అన్నాడు కద! ఏమని?

"ఈయన సమర్థుడయిన సీనియర్ ఇంజనీరు. ఈయన కంపెనీ వదలివెళ్లడం నిజంగా మనకు లోటు... కాని ఆయన ఇష్టానుసారం వెళ్లక తప్పదు. పోయిన వార్షిక మరమ్మత్తు పనులు ఒక్కచేతి మీదుగా ముగించాడు. ప్లాంటులో ఎన్ని పైపులైనులున్నాయో, లైనుకు ఎన్ని జాయింట్లు, ఫ్లాంజిలు ఉన్నయో, ఏ ఫ్లాంజికి ఏ సైజు బోల్టులున్నాయో నిద్రలో కూడా తడుముకోకుండా చెప్పగలిగే ప్రజ్ఞాశాలి ఇతడు."

"మొసలి కన్నీరు కార్చకురా దగుల్బాజీ వెధవా... పోయినసారే కాదు ప్రతిసారీ వార్షిక మరమ్మత్తు కార్య నిర్వహణ భారం నా భుజాల మీదికే ఎత్తుతున్నారు. పనుల పర్యవేక్షణ చూస్తూ, ప్రగతి నివేదికలు దినం దినం నేను తయారుచేస్తే- నువ్వూ, నీ జియం వాటిని యథాతథంగా ఫాక్స్ కొట్టి కేంద్ర కార్యాలయం నుండి మానేజింగ్ డైరెక్టరు మన్ననలు పొందేవాళ్లు. నన్ను పప్పులో కరివేపాకులాగా వాడుకున్నారు. చివరికి ప్లాంటు ఇంజనీరు ప్రమోషను సందర్భంలో నాకు మొండిచెయ్యి చూపెట్టారు," అని ఎలుగెత్తి అరవాలని పించింది. కాని సభ్యత కాదని ఊరుకున్నావ్.

ప్లాంటు ఇంజనీరు ప్రమోషనుగ్గాను అభ్యర్థుల అర్హతలు మదింపు వేసేటప్పుడు సర్దార్జీ జి.యం. దురుద్దేశపూర్వకంగా వ్యవహరించాడు. నీ ఇంటర్వ్యూ బాగా ఉన్నా నువ్వు మాజీ చీఫ్ శర్మ గ్రూపు వ్యక్తివన్న కక్షతో నీకు ప్రమోషను తిరస్కరించాడు. ప్రస్తుతం ఈ స్థానంలోకి మాస్టర్స్ డిగ్రీ ఉన్న అభ్యర్థి కావాలి అని పుల్లవేశాడు. నువ్వూ, ఆ శర్మాచేసిన పాపాలేమిటి? గాడిదగుడ్డు... ఏడాది క్రితం జియంగాడు ప్లాంటు తనిఖీకి వచ్చినప్పుడు ఒకనాడు శర్మ వంధిమాగధ ఆఫీసర్లు బృందంలో కనబడలేదు. ఆయన ఆ ఉదయం యువ ఆఫీసర్లకు మేనేజిమెంటు మెళ కువలు బోధిస్తూ వర్కుషాప్‌లో ఉండిపోయాడు. రౌండుకు వచ్చి జియంగాడు ఊడబొడుస్తున్నదేమిటి? 'ఫలానాచోట చమురు బాగా కారుపోతోంది అరి కట్టండి, కేబుల్ కందకాల్లోకి ఎలుకలు పోకుండా ఇసుక నింపించండి. నీరు సప్లయి చేసే క్యాబిన్

నిర్మాణం వంకరగా ఉంది, వెంటనే సరిచేయించండి,' అనే అప్రధానమయిన విషయాలు లేవనెత్తి అధికారులను గంగిరెద్దుల్లా ఆడిస్తాడు. అంతే తన వెంట బృందంలో అందరూ ఉండి శర్మ లేకపోవడాన్ని అవిధేయతగా అర్థం చేసుకున్న జియం మర్నాడు మీటింగులో పరుషమైన పదాలతో శర్మను కించపరచాడు. ఆత్మాభిమానం ఉన్న ఆ పెద్దమనిషి వెంటనే రాజీనామా పత్రం మొఖాన కొట్టి వెళ్లిపోయాడు. ఆయనిప్పుడు ఓ ప్రముఖ సంస్థలో జనరల్ మానేజర్. ఆ సంస్థ పంపిన రసాయనాలు డబ్బుకట్టి విడిపించుకోలేని విధంగా దివాలా తీసిన కంపెనీకి జియం ఈ వెధవ. శర్మగారి స్థానంలోకి ప్రమోటయిన ఈ బండ పెదవుల కప్ప జియం గాడు పుల్లవేస్తే వేశాడు పో- సీనియారిటి వివరించవచ్చు కదా... ఊహు... అలా చెయ్యలేదు. బెకబెకమని నవ్వి వెంటనే తన కులం వాడయిన ఆ ఇబిసి అదే ఏబ్రాసి రావుగాడి పేరు ముందుకు తోశాడు. హతవిధీ! పరిశ్రమల్లో కూడా కులతత్వం నిండి పోయింది. ముఠాలు, లాబీలు. చేయూత దొరికి నీ తరువాత చేరినవాడు. ఇప్పుడు నీపై ఆఫీసరయ్యాడు. ఛ... ఛ... డిపార్టుమెంటు నిండా చంచాగిరీ కొజ్జాలు, కులగజ్జిగాళ్లు.

తక్షణం వెళ్లిపో... మేధ, మస్తిష్కం నిర్భయంగా విహరించే చోటికి... ప్రతిభకు గుర్తింపు దొరికే తీరానికి. పోతేపోనీ హితుల్.. సుతుల్... సతుల్... అరే ఛలో... ఈ వెధవలు నిన్ను గుర్తిస్తే ఎంత? గుర్తించకపోతే ఎంత? యె దునియా యె మహఫిల్ తెరేకామ్‌కీ నహీ... పేరుమోసిన విదేశీ కంపెనీకి, సౌదీలోని చమురుశుద్ధి కర్మాగారానికి సముద్రోపరి నియామకాల్లో అరవై మంది అభ్యర్థుల్లో ముగ్గురు సెలెక్టయ్యారు... వాళ్లలో నువ్వొకడివి.

షిఫ్ట్ ఇంజినీరుగా... గ్రేట్...

రెండంచెల ఎంపిక విధానంలో నీ పాటవం చూసి కెనడా ఇంజనీరు టర్కీకోడిలా మెడనిక్కించి కేర్ మన్నాడు.

అరబ్బీ మానేజర్ చెంఘిజ్‌ఖాన్ గుర్రంలా సకిలించాడు.

పరిశ్రమలో ఇరవై ఏళ్ల సుదీర్ఘనుభవం. ఇంకా యువకుడివే.. గూడ్... గూడ్...

ఉత్పత్తి విధానం, పరికరాల, మెషీన్ల, బాయిలర్ల విశిష్టతలు రసాయనిక సమీకరణాలు చకచకా... ఓకే...

శాస్త్రసాంకేతిక రంగాల్లో ముందంజ, ప్రత్యామ్నాయ శక్తివనరులు, రసాయనాలను నవీన పద్ధతుల్లో చౌకగా తయారుచేసే విధానాలు... పూసగుచ్చినట్లుగా... ఫైన్ ఫైన్.

జీతభత్యాలు, షరతులు, విధులు... అన్నీ అంగీకారమే.

సంతకం బరబరా.

థాంక్యూ...

రియాద్‌లో మళ్లా కలుద్దాం.

ఆహ్లాదకరమైన స్థితి అయిదు నక్షత్రాల హోటల్ లో... నేలంతా మెత్తని ఎర్రటి తివాచీ, జిగేల్మంటున్న దీపపుగుత్తులు, దేవకన్యల్లా తిరుగాడుతున్న లేడీ రెసెప్షనిస్టులు, విదేశీయత స్వదేశీయతల సమ్మేళనం...

మొదటిసారిగా అడుగుపెట్టావు. దిగ్విజయవంతం జీవితమంతా నక్షత్రాలే.

కొంచం నెమ్మది... ఆయాసంగా ఉంది కదూ... ఈరోజే ప్రయాణం. చిక్కులేమీ కొని తెచ్చుకోకు... స్లో డవున్... గుండె సామర్థ్యం పెరుగుతుంది. రక్త ప్రసరణ వేగం పెరుగుతుంది... రక్తనాళాలు అడ్డంగా వ్యాకోచిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది. వాకింగ్ లాభాలు ఎన్నెన్నో డాక్టర్లు చెప్పేదాకా తెలియదు. రోగాలు నివారించుకోవడమే తెలివి అంటే... మందుల కోసం మనుషులా... మనుషులకోసం మందులా... వైద్యవృత్తి పూర్తిగా వాణిజ్యం. టెస్టులకు వందలు వేలే ఫీజులు... మాధురిని మెడిసిన్‌లో వెయ్యాలి... దాని పోకడలు సుదర్శనంగారికి స్పష్టంగా చెప్పాలి. ఐనా గుర్రాన్ని చెరువుదాకా లాక్కెళ్లగలం. అంతే... ఎంతైనా నీ కూతురు నీ మాట వింటుంది. ఇప్పుడు చిన్నపిల్లే కదా.

డయాస్టొలిక్ ఇవ్వాళ ఎనభై తొంభయి మధ్యకు వస్తుందేమో... రెండున్నర కిలోమీటర్ల దూరం గతించింది. అల్లంత దూరంలో గురుద్వారా... ఇంకా ముందుకు పోతే ఫ్యాక్టరీ మెయిన్ గేటుకు వెళ్లే రోడ్డు కూడలి. మొత్తం మూడు కిలోమీటర్లన్నా కావాలి. హల్లో గుడ్‌మార్నింగ్ విష్యా ఆల్ ద బెస్ట్... గుడ్ మార్నింగ్... థాంక్యూ.

ఎవరది... మెటీరియల్ మేనేజర్ గోపాల్‌వర్మ... పక్కనున్నది పర్చేజింగ్ ఆఫీసర్ రంగరాజన్. కడుపులో చల్ల కాదు... బీరు కదలకుండా నడిస్తే ప్రయోజనం శూన్యం. బ్రిస్క్ వాకింగ్ వాళ్లకేం అవసరం. వర్మ ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు చేశాడు. రంగరాజన్ కొడుకు యంబిఏ అయిన వెంటనే రిలయన్సులో చేరాడు. వాళ్ల జీవితాలు స్తబ్ధం... స్థిరం... నీదే పరుగు. తప్పదు మరి. ముఖ్యమైన విడిభాగాల కొనుగోళ్లలో ఫిఫ్టీ ఫిఫ్టీ...

కంట్రాక్టర్ల బిల్లుల్లో ఇరవైశాతం... నాసిరకం కందెనలు పాత బేరింగులు మెరుగు పెట్టబడి తిరిగి కంపెనీకే సరఫరా, వ్యర్థసామగ్రి, ఇనుపతుక్కు అడుగున ఖరీదైన స్టీలు రాడ్లు బయటికి రవాణా, వీటికి ముడుపులు ఎంతో పెరుమాళ్లకే ఎరుక. విజిలెన్సు, సెక్యూరిటీ, కార్మిక సంఘాల కుక్కలకు నోళ్లనిండా బొమికలు. అందినంతా ఇచ్చుకో అందినంత జుర్రుకో... ఈ మునిగి పోతున్న ఓడలో పైన ఉన్న పెద్దమనుషులందరూ పదిలంగా ఉండి, ముందుచూపుతో భవిష్యత్తు భద్రం గా ఉంచుకున్నారు... కామధేనువు వట్టిపోయింది. చచ్చిన పీనుగును కూడా వదలకుండా అనుభవించండి స్కాండ్రల్స్...

అదిగో అల్లదిగో ఫ్యాక్టరీ! నిస్తేజంగా నిర్వేదంగా ఎదురుకాల్పులు జరిగిన ఊళ్లోలాగా నిశ్శబ్దం తాండ విస్తోంది. ఎత్తయిన టవర్లు పోలీసు స్టేషనులో శిరో ముండనం గావించబడ్డ తెలుగు మహిళల్లావున్నాయి... బాయిలర్ చిమ్నీ శిలువ వేయబడ్డ కరుణామయుడి లాగా వుంది. నా రక్తంతో పాపులు పరిశుద్ధులగుదురు.. ఈకాలంలో పాపపుణ్యాల చింతన ఎవడికుంది మహాత్మా! మద్రాసీ డిజియం ఆనాడే జిటి ఎక్స్‌ప్రెస్ ఎక్కేశాడు. బెంగుళూరులోని బినామీ పరిశ్రమ 'పల్లవి బేరింగ్స్' చూసుకుంటున్నాడు. సత్‌శ్రీ అకాల్‌కీ... తాను దైవమంటే భయపడే వ్యక్తినని చెప్పుకుని అందరి చెవుల్లో పువ్వు పెట్టి విచారణ సంఘం వెంబడి ఢిల్లీ వెళ్లిన సర్దార్జీ ఇక రాడు అని అందరికీ తెల్సిపోయింది.

అమ్మగారి బూట్లు నాకే కపూర్‌గాడు మేడమ్‌ని పల్లకిలో మోసుకెళ్లి ఢిల్లీ ఫ్లయిట్ ఎక్కించాడట... ఎవరి దారి వారు చూసుకుంటున్నారు తప్పేముంది?

పద... పద... ఈ ఫ్యాక్టరీకి నీకు రుణం తీరిపో యింది. దాని గురించి ఎందుకు ఆలోచన? నూతన ఆర్థిక విధానం అద్దాల్లోంచి పడ్డ ప్రభుత్వం శీతకన్ను, యాజమాన్యం అవినీతి, అసమర్థత అరయంగా కర్ణుడీ ల్గెనార్గురి చేతన్... రోడ్లకూడలి... స్లో డవున్... మొత్తం మూడు కిలోమీటర్లు. ఇరవై అయిదు నిమిషాల సమయం. రోడ్ల కూడలిలో వృత్తాకారపు చిన్నితోట చుట్టూ కంచె మధ్యలో చిన్నగద్దె. శిలాఫలకం మీద ఉద్యోగ నిర్వహణలో అణువులు బాసి అమరులైన శ్రీయుతులు... నాలుగు పేర్లు. ఇక్కడ స్థూపం నిర్మిస్తా రట. కేంద్రమంత్రి ద్వారా ఆవిష్కరణ జరుగుతుం దంట? పిచ్చివెధవలు. మొత్తం ఉద్యోగుల భద్రతకే సమాధి తయారవుతూంటే స్థూపాలెందుకు? ఎన్ని కాళ్లు అప్రయత్నంగా ప్రదక్షిణ చేస్తున్నాయ్... ఒక నిముషం మౌనం... మరోమారు ఫలకం మీదకు దృష్టి. మొదటి పేరు నీ మిత్రుడిది... శేఖరన్. ఇన్‌స్ట్రుమెం టేషన్ ఇంజనీరు. కలిసి తిన్నాం. కలిసి తాగాం. ఎక్కడో మలబార్ తీరంలోపుట్టి పెరిగావ్... ఇక్కడ ఈ నదీతీరం లో గిట్టావ్... స్వేచ్ఛగా బ్రతికావు... శాశ్వతంగా స్వతం త్రుడివి అయ్యావు... నీ ఆత్మ శాంతించుగాక మిత్రుడా గుడ్‌బై...

మెల్లగా చెమట ఆరుతోంటే ఎంత హాయిగా ఉంది. కూలింగ్ డౌను... రోడ్డుమీద వాహనాల రొద మొదలయ్యింది. సుబ్బారావుగారు జ్ఞాపకముంచు కున్నాడా. లేక... ఛట్... వాడి గురించి మర్చిపో కాసేపు. చర్చి దగ్గర కుడివేపు మలుపు... ఈ రోడ్డు ఇలాగే తిన్నగా, సూటిగా అనంత దూరం సాగిపోతే ఎంత బాగుండు! అసాధ్యమైన కోరిక. పిచ్చివాడా... గ్రహాలు, నక్షత్రగుత్తులు, ఈ భూమి గోళాకారంగా ఉన్నాయన్న ప్పుడు సరళరేఖకు అర్థంలేదు. అవధుల్లేని విశ్వం తనలో తాను వంపు తిరిగినప్పుడు సూటిగా తిన్నగా అన్న ఆలోచనలు... అమాయకత్వం... నేను ఫస్ట్ అహా... మైదానంలో కుర్రాళ్లు పరుగు ప్రాక్టీసు చేస్తున్నారు. రుక్కుకు వీళ్లను చూసి అయినా బుద్ధి వస్తుందేమో... వృథా ప్రయాస... శరీరం సమశీతోష్ణస్థితికొచ్చింది... చలి పారిపోయింది... ఇంకా మంచుతెరలు వీడలేదు... తూర్పు తెల్లారలేదు. సుదీర్ఘమయిన రాత్రుల్లో ఎందాకా నీ పయనం పథికుడా...

'అరే, ఈ వృత్తాలు, సదిశ రాశుల విశ్లేషణ లెక్కలు నా బుర్ర కెక్కడం లేదురా', ట్యూషన్‌కు వెళు తున్న విద్యార్థినీ విద్యార్థుల కులుకుల నడకలు... అరే ఆడపిల్లలూ ఆ చీకటి పార్కులోంచే వెళ్లాలా... రోడ్డు వదలి అలా వెళ్లడమేమిటి? ఈ పార్కులోనే ఆనా డెప్పుడో పొదచాటు ప్రేమ వ్యవహారం నడిచిందన్న వార్త గుప్పుమంది. వనితామండలి సభ్యురాళ్లు కామినీ కేంద్ర ఆడిటోరియంలో నీలిచిత్రం క్యాసెట్లు ప్రతి ఆదివారం దొంగచాటుగా వేసుకుంటారట కద... మాధురి రోజూ ట్యూషనుకు వెళుతున్నదా... లేక పార్కులో బెంచిమీద కూర్చుని, 'సెక్సీ, సెక్సీ సెక్సీ ముఝె లోగ్ బోలె' అని కూనిరాగం తీస్తుంటుందా... సుదర్శనంగాడికి గట్టిగా నొక్కిచెప్పాలి, ఎంత ఖర్చయినా సరే మంచి కాలేజిలో వేయమని. ఎప్పుడూ ఏడుపు ముఖం పెడతారేమిటండీ అంటుంది రుక్కు. ఎప్పుడూ సంతోషంగా ఉండడం సాధ్యమా ఎవరికన్నా? ఆఁ... శేఖరన్‌కు సాధ్యమే పెళ్లి కాని యువకుడు. కొబ్బరి తోటలు మస్తుగా ఉన్నాయని చెప్తుండేవాడు. ముఖంలో ఎప్పుడూ చెరగని చిర్నవ్వు...

జల్సాగా తిరుగుతూ రోజు క్లబ్బుకొచ్చి నవ్వుతూ అందర్నీ నవ్విస్తుండేవాడు. నల్లటి ఉంగరాల జుట్టు. తెల్లని పలువరుస ఇంకా కళ్లల్లో మెదుల్తున్నాయి. వాడి చావు కబురు విని వాడి తల్లి షాక్ తిందట... ఉద్యోగం అవసరం లేదురా అంటే వినలేదు. చివరికి కడుపుకోత పెట్టి వెళ్లిపోయాడు. విలపిస్తున్న తండ్రిని ఓదార్చడం కష్టమయింది నీకు...

జేబులో ఏమిటిది ఓహ్ ఉత్తరం.. డయాస్టొలిక్ తగ్గినట్టే తగ్గి మళ్లా పెరుగుతోందా... ఆగు ఏదో వాసన... ఏమి సంబంధమో. ఈ వాసన నీ అంతరంగంమీద అమితమైన ప్రభావం చూపుతుంది.. బొగ్గు. రాకాసి బొగ్గు కాలుతున్న వాసన.. రోడ్డు మరమ్మత్తు పనిలో పనిగా టెలిఫోను తీగల విస్తరణ పనులు జరుగు తున్నాయి. శవాలంకరణలో సివిల్ డిపార్టుమెంటు పరిగెరుకుంటోంది.. రోడ్డు పని కూలీలు రోడ్ల ప్రక్కనే తాత్కాలిక నివాసమేర్పరచుకున్నారు... కల్వర్టు దగ్గర ఓ కుటుంబం... చలి మంట చుట్టూ రాకాసి బొగ్గు బర బర మండుతోంది. సమీపంలో మరో పొయ్యిమీద డబ్బాలో తారు మరుగుతోంది. ఒంటెద్దు బండి వాడు రాకాసి బొగ్గు కుమ్మరించి, ఎద్దును మళ్లా బండికి పూన్చుతున్నాడు... మంట చుట్టూ కుటుంబం. ముసల్ది, పడుచుపిల్ల, యువకుడు, మంట తగ్గిన నిప్పులమీద వంటపాత్ర, నల్లటి దేహమ్మీద ముగ్గుబుట్ట తల.

ఈ ముసల్ది అమ్మలాగే వుంది. ఆ చామనఛాయ పడుచుపిల్ల ముక్కుపుడక రాయి తళుక్కుమంటోంది. ఆ యువకుడి నోట్లో ఎర్రగా కాల్తున్న బీడీ. కళ్లలో ఎర్రగా ప్రతిఫలిస్తున్న మంట.

నీ తమ్ముడు, చెల్లి ఇక్కడే వున్నారా?

మరుగుతున్న తారు... బొగ్గు నుండే ఉత్పత్తవు తుంది తారు! విధ్వంసక స్వేదన క్రియ ద్వారా బొగ్గును వెయ్యి డిగ్రీల సెంటిగ్రేడు దగ్గర మరిగిస్తే...

నీలోని మథనం తీవ్రతకు కొలబద్దలేదు...

మరోమారు ఉత్తరం చదువు.

'అన్నయ్యా, ఒక్కసారి రా.'

అమ్మకు ఎలా వుంది. కోలుకుంటుందా... లేక?

నువ్వు వెళ్లిరాగలవా? మూడు వందల కిలో మీటర్ల దూరం. ఎలా వెళ్లడం? ఆఖరు చూపు... విశ్వాస ఘాతకుడా!

ఫ్లయిటు తేదీ జనవరి ముప్పయి ఒకటి. నంబర్ ఎస్వీ ఏడు వందల యాభైమూడు. సెక్టరు బొంబాయి నుండి టెహరాన్‌కు, సమయం ఉదయం ఏడుగంటల నలభై అయిదు నిమిషాలు... ఒకరోజు ముందుగా ప్రతి నిధిని కలుసుకుని వీసా తదితర పత్రాలు తీసుకోవాలి. కలవకపోతే ఆ ఫిలిప్పిన్‌దో, పాకిస్తానీదో, బాంగ్లావాడిదో వేరే వాడి పేరు వీసాలోకి ఎక్కుతుంది. ఆ గుజరాతీ అభ్యర్థి నీకంటే అయిదు వేలు ఎక్కువిచ్చేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఏజంటు గుంభనంగా అన్న వాక్యం చెవుల్లో ఇంకా వినబడుతోంది.

ఉత్తరం మంటల్లోకి జారిపోతోంది. పోనీ కాలి పోనీ - అమ్మా నీకు తమ్ముడొక్కడే కొడుకు... వీడు లేడమ్మా.. వీడు ఏనాడో చచ్చిపోయాడు. తమ్ముడా... అమ్మ భారం నీదే.

'తమ్మీ ఓ బీడీ ఇవ్వు...'

ఇంకొద్దిసేపు ఇక్కడే కూర్చుంటే...

శేఖరన్ ప్రభృతులు భౌతికంగా మరణిస్తే నువ్వు మానసికంగా ఆత్మికంగా ఏనాడో మరణించావు.

శ్వాసిస్తూ, చలిస్తున్నంత మాత్రాన బతికి ఉన్నట్టు కాదు.

నీ చావుకు కారణం ఎవరు? సమాధానం దొరకదు!

'ఛెళ్... ఛెళ్'

బండివాడు చెర్నాకోలతో ఎద్దును కొడితే నీకు చురుక్కుమంటోందేమిటి?

బొగ్గుపెళ్ల చక్రం కిందపడి బండి కదలడం లేదు... ఎద్దు గింజుకుంటోంది. తమ్ముడు సాయం పట్టి తోస్తున్నాడు.

నీకెవరూ సాయంరారు... ప్రవాహంలో పడిపో యావ్. ప్లవన సూత్రాలు గుర్తున్నాయా? ఊపిరున్నంత వరకూ ఈదాల్సిందే... లే... లే... కదులు...

*విపుల మాసపత్రిక, మే 1995*

